# గుర్తింపు - స్మరణ

నేను బాబాకు చెందిన వాడిని. బాబా నావాడు! అనేటువంటి ఆ అనుబంధం, ఆ అనుభవం, ఆ గుర్తింపు అది చాలు. దానిని నీవు గుర్తుపెట్టుకున్నంతవరకు అదే నిజమైన స్మరణ అవుతుంది. స్మరణ అంటే గుర్తుపెట్టుకోవడం. నీకు అటువంటి అనుబంధం ఉంటే, ఒకవేళ బాబా ఇవ్వకపోయినా ఆ అనుభవం చెరిగిపోదు.




ఉదాహరణకు నీకో బిడ్డ ఉంది, తను స్కూలు పరీక్ష పాస్ కావాలని నువ్వు ఎంతగానో అనుకుంటావు. కానీ తను పాస్ కాలేదు. ఆ బిడ్డ పట్ల నీ ప్రేమ పోతుందా? ఆ అమ్మాయిని ఇంకా ఎందుకు ప్రేమిస్తున్నావు? ఎందుకంటే తను నీ బిడ్డ కాబట్టి. మనం అడిగింది బాబా ఇచ్చినా, ఇవ్వకపోయినా నీకు ఆ అనుబంధం ఉంటే చాలు. అన్నీ జరిగిపోతాయి. అది చాలా సులభంగా అనిపిస్తుంది కానీ అంత సులువు కాదు. ఆ అనుబంధ భావనను వాస్తవం చేసుకోవడం కోసం, ఆ గుర్తింపు కోసమే మనమందరమూ ప్రయత్నించేది.

- శ్రీబాబూజీ, శరశ్చంద్రికలు

శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!

సర్వమయ... సర్వవ్యాపక..



# కృప

శ్రీరామనవమి సంచిక

సద్గురుమూర్తియే సర్వజీవ స్వరూపునిగా అల్లుకొని ఉన్నారని తెలియుటకు 'శ్రద్ధ' కావలెను.
వారి దర్శనము పొందుటకు 'భక్తి' కావలెను.
భావన చేయుటకు 'ఓర్పు' కావలెను. స్వభావము 'నిర్మలము' కావలెను.
అప్పడే వారు సర్వమయులని, సర్వవ్యాపకులని తెలియగలము -
గుండెలో నిలుపుకొనగలము - అనుగుణముగ వర్తించగలము.

"నేనెవరు?" అనే విచారణ వ్యక్తి అస్తిత్వానికి సంబంధించినది. ఒక్కొక్కరు ఆ గుర్తింపును ఒక్కొక్క రకంగా అనుభవం చెందుతారు. "నేను ఆత్మను, నేను బ్రహ్మాన్ని, నేను ఈశ్వరుణ్ణి, నేను సాయిబాబా బిడ్డను, నేను ఆయన వాడినే, ఆయన నావాడు" ఇలా కొంతమంది అనుభూతి చెందవచ్చు. అది నాకు చెందినది కాబట్టి నువ్వు దానిని పొందాలనుకుంటావు, అనుభవైక వేద్యం చేసుకోవాలనుకుంటారు.



## నేనెవరు?

'నేను పొందాలి' అనుకోవడం అసహజమైన విషయం కాదు. నిజానికి మనకంటే ఉన్నతమైన అస్తిత్వంతో లీనమవడం అనేది ఒక అందమైన భావన. మనలో ఆ గుర్తింపు భావన కలగడమే ముఖ్యం. నిజానికి మనలో పరివర్తన కలిగించేది అదే. ఎందుకంటే మనలో భావోద్వేగాలు, ఆలోచనలు అన్నీ దాని మీదనే ఆధారపడి ఉంటాయి. ఒక్కసారి మన గుర్తింపు మారడం, పరివర్తన చెందడం ప్రారంభమైన తరువాత మన అనుభవాలు, మన జీవితం మొత్తం పరివర్తన చెందడం ప్రారంభమవుతుంది. 'నేను' ఫలానా అనే ఆ గుర్తింపే దానికి మూలం.

– శ్రీబాబూజీ, శరశ్చంద్రికలు

యద్యదాచరతి శ్రేషః శ్రేష్టమైన వాటిని తాము ఆచరించి చూపి, జన బాహుళ్యానికి మార్గాన్ని చూపిన సద్గురు పరంపరను గమనిస్తే, మహాత్ముల జీవితాల్లో 'వెనకడుగు'కు చోటు లేదు. – తమ'కడగు' స్వార్థం లేదు – సర్వజీవులకు 'గొడుగు'గా నిలబడటం తప్ప! జగత్తుకు 'గొడుగు'గా నిలుస్తారని అంటుంటే ఇదిగో ఈ క్రింది సంఘటన గుర్తొచ్చింది. సాంప్రదాయక కుటుంబనేపథ్యమున్న సుబ్రహ్మణ్యశాస్త్రిగారు తన కుమారుడి తెలివితేటలను, కుశాగ్రబుద్ధిని చూసి బాలుడి జాతకాన్ని మిత్రుడైన న్యాయవాదికి చూపించారు. పిల్లాడి జాతకాన్ని పరిశీలించిన వారు – మహాలక్ష్మమ్మగారితో "ఒక చెంబుతో నీళ్ళు పట్టుకురామ్మా!" అని అడిగారు. ఆ నీళ్ళతో బాలుని పాదాలు కడిగి, ఆ బాలుని పాదాలకు సాగిలపడ్డాడు. నిర్ఘాంతపోయిన ఆ దంపతులకు "విను మిత్రమా! ఒకానొకప్పుడు అశేష ప్రపంచం నాలాగే ఈ చిన్నవాని పాదాలకు ప్రణమిల్లుతుంది. అప్పటికి నేను బ్రతికి ఉండను కదా"! అన్నారు. ఇందున మనకు కనిపించే 'అశేష ప్రపంచం' స్వామివారి పాదాలకు ప్రణమిల్లడం ఒక కోణమయితే – సద్గురు అనుగ్రహ విశేషంగా ఆచార్య పీఠమును అధిష్టించిన పరమాచార్యులు ఈ జగత్తుకోసం ఈశ్వరుని పదాలకు ప్రణమిల్లడం విశేష కోణం. ఇందుకు స్వామివారి మాటలే నిదర్శనం.

ఒకనాడు స్వామివారితో మాట్లాడుతూ అంతరంగికులు ఇలా అన్నారు. "స్వామీ! మీరు జగద్గురువులు కదా!" అంటూ ఏదో చెప్పబోయారు. ఇంతలోనే వారించి, "ఈ జగత్తు నాకు గురువు" – జగత్తును గురువుగా కలిగినవాడిని కనుక జగద్గురువును" అని పిలువబడుచున్నానని సెలవిచ్చారు.సత్యద్రష్టల– దృష్టికోణమే మనకు నిజమైన బోధ కదా!

మా గురుదేవుల జీవితమంతయూ ఇట్టి ఆదర్శమే! వారి నోటి నుండి ఏనాడూ "వినండయ్యా,! అడగండయ్యా!" వంటి మాటలు విన్న నాడు లేదు. ఎవ్వరు వచ్చినా, ఎవరితో మాట్లాడినా, 'చెప్పండయ్యా' అంటూ ప్రతి జీవినీ సాయి స్వరూపంగా భావించేవారు. ఋణానుబంధం లేకుండా ఎవ్వరూ వారి వద్దకు రారన్న సాయిబాటను విశ్వసించి, "సహస్రాక్ష సహస్రపాత్" అన్నట్లు సర్వకాల సర్వావస్థలయందు సాయినే దర్శించేవారు. వారి అనుగ్రహ ప్రసాదమే ఈ పొత్తము. వారి కరుణా విశేషమే సమస్తమూ! *ఓ సద్గురూ! మా హృదయమందిరంలో నిలచి ఈ సమస్త జగత్తంతా సద్గురు స్వరూపంగా భాసించేటట్లు చేయి! ఎప్పుడూ జగత్కల్యాణ కార్యాలు చేయాలనే సద్బుద్ధిని ప్రసాదించు!*

–గురుకృప



బిడ్డను ఆశ్రయించడాన్ని ఆ తల్లిదండ్రులు ఎలా భావించేవారో ఎవ్వరికీ తెలియదు. అయితే ఏనాడైనా, ఎవరైనా వారిని పలుకరించి, విచారించి 'స్వామినాథన్' కాదు కాదు శ్రీచంద్రశేఖర సరస్వతీస్వామి వారి గురించి ఏమడిగినా వారి మోము నుండి మౌనమే సమాధానమయ్యేది. ఇలాంటి ఒక దుస్త కార్యానికి కలవాయి వేదికయ్యింది. ఫిబ్రవరి 13, 1907వ సం॥ ప్రభవ నామ సంవత్సరం స్వామినాథన్ 68వ పీఠాధిపతులుగా వారి పరమ గురువుల నామధేయమే అయిన శ్రీచంద్రశేఖర సరస్వతీస్వామిగా కంచి పీఠమునకు ఆచార్యులుగా ప్రతిష్ఠితులయినారు. కాలాంతరంలో 'నడిచే దేవుడు'గా, 'నడయాడే దైవం'గా ఆరాధనీయులయినారు.

13 ఏళ్ళ స్వామి జీవితం ఒక జీవన వేదంలా సాగింది. వేదానికి జీవము సు'స్వర'మయితే – స్వామి జీవితానికి తపోనిష్ఠలు, క్రతు నియమాలు సారమయ్యాయి. ఓ వంక సమాధి చెందిన వారి గురువు, పరమ గురువుల ఉత్తర క్రియానుష్ఠానాలు – మరో వంక తొమ్మిది రోజులుగా ఆగిపోయిన చంద్రమౌళీశ్వర సేవను తొమ్మిది పర్యాయములు చేసి, ప్రతీ దినము మరల కొనసాగింపును నిర్వర్తించడం. కాలగతి తెలియని స్థితి. సన్యాసాశ్రమ ధర్మమున సూర్యాస్తమయ పర్యంతం ఆహార స్వీకరణ ఉండేది కాదు. ఎన్నోసార్లు స్వామి నిరాహారిగా ఉండేవారు. రోజూ ఎనిమిది గంటలన్నా నిద్రించే వయసులో రెండు గంటలకు మించి నిద్రకు అవకాశం ఉండేది కాదు. చంద్రమౌళీశ్వర సేవ – గురు'చంద్రుల' ఆరాధన – ఇవే నిత్యకృత్యాలయ్యాయి.

13 ఏళ్ళ బాలునిలో కనిపించే ఈ స్థితప్రజ్ఞతకు 'గురు అనుగ్రహప్రజ్ఞ'గానే దర్శించగలుగుతాము. బాల'స్వామి'లో కన్పించే ఈ పరిణితి – కేవలం గురుకృప కాక మరేమవుతుంది. ఇంకో సంఘటనను చూద్దాం. స్వామి చంద్రమౌళీశ్వరాధనకు ఆయత్తమయి, ఈశ్వరుని అభిషేకించే వేళ పండితులు ఇలా చెప్పారు "స్వామీ! అభిషేక సమయంలో మీలో ఉండాల్సినది ఏకత్వభావన. ఈశ్వరుడు, మీరు ఒక్కటేనన్న భావన". అందుకు స్వామివారు ఇలా అన్నారు "కేవలం ఆరాధన సమయంలో మాత్రమే ఉండాల్సిన భావమా ఇది! లేక సర్వావస్థలయందు ఈ భావనయే కలిగిఉండాలా? చిన్నారి అయిన స్వామిలోని పరిణితిని చూసి పండితులకు అవగతమయింది. వారు గురుఅనుగ్రహ సరస్సులో విరబూసిన ఆచార్య'పద్మ'మని.






సంపుటి : 19
ఏప్రిల్ 15

కృప

సంచిక : 2
2016



# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

– శ్రీబాబూజీ



లోపలి పేజీలలో

ఆధ్యాత్మికత 4
– గురుకృప

శ్రీబాబూజీ 7
డా॥ బి.శ్రీనివాసులురెడ్డి

శ్రీరాముని హిత వాక్యములు 16
– గురుకృప

పరమగురువు యేసు కథ 17
– గురుకృప

సాయినాథుని సత్సంగ సుధ 19
– శ్రీబాబూజీ

గురుకృపాలహరి 25
– గురుకృప

నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు
GURUKRUPA
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.
Web : www.gurukrupa.info



## ఆధ్యాత్మికత

ఆధ్యాత్మికత అంటే అదేదో సనాతన సంప్రదాయము, ఆచార వ్యవహారాలకే పరిమితమైనదని భ్రమిస్తాము. ప్రాపంచిక జీవితానికి, వ్యవహారాలకు అతీతమైనదని భావిస్తాము. ప్రాపంచిక విషయాలను వదులుకుంటేనే ఆధ్యాత్మికత వంటబడుతుందని విశ్వసిస్తాము. ఈ భావనలతో బందీయైన మన(స్సు)లను, ఆధ్యాత్మికతను సరికొత్త కోణంలో నిర్వచించి, దర్శింపచేస్తూ విముక్తుల్ని చేసారు శ్రీబాబూజీ. ఆధ్యాత్మికతను సంక్షిప్తంగా వర్ణించాలంటే....'ప్రేమను అనుభవించడం-ప్రేమను వ్యక్తపరచడం', ఏదైతే మనలను అన్నిరకాలుగా ఉత్తేజపరుస్తుందో అదే ఆధ్యాత్మికత. స్పష్టమైన ఆనందం, తృప్తి, అనుభవమయ్యే దిశగా నడిపించేది ఆధ్యాత్మికత. జీవితాన్ని సంపూర్ణంగా జీవించడం, జీవితంలో సంపూర్ణంగా పాలుపంచుకోవడం ఆధ్యాత్మికత. (జీవితాన్ని సంపూర్ణంగా అనుభవించడం). జీవితానికి నిండుదనాన్ని, పరిపూర్ణతను ఇచ్చేది ఆధ్యాత్మికత అంటారు శ్రీబాబూజీ.

సృష్టి యావత్తూ, ప్రతి మానవుడు ఏ దైవంచేత సృష్టించబడ్డారో అటువంటి సర్వాంతర్యామి, సర్వవ్యాపకుడు అయిన దైవం యొక్క అనుభూతిని పొందాలని మనమందరం కోరుకుంటాం. భగవంతుడే అంతటిని సృష్టించాడని, కడకు ఆయన్నే మనమందరం చేరుతామన్న ప్రత్యక్ష అనుభూతి మనకు భద్రత, రక్షణ, ఆనందం, ప్రేమ, తన్నుతాను మర్చిపోవడం (పరవశం), కలిమి, బలిమి కూర్మినిస్తుంది.

కూరిమి - నలుగురితో కలిసి ఉండే లక్షణం. కలిమి ఉంటేనే ఈ ప్రపంచం మాటలు కలుపుతుంది. మామూలుగా ఉండేటువంటి ఆనందం, దుఃఖం లేకపోవడం, ఒక ప్లెజర్ సెన్సేషన్ ఉంటుంది. అదే సద్గురు సాన్నిధ్యంలో అక్కడుండే ఆనందం, ఒక ధనికుడిగా భద్రత, ప్రేమ, తనను తాను మర్చిపోవడం, ఇవన్నీ ఉంటాయి.

మనకు అత్యంత ఆవశ్యకమైన అవసరాలను వెనక్కి నెట్టలేము. కోరికలు వదిలిపెట్టలేము. తిండి, నిద్ర, మైధునం, స్వీయ సంరక్షణలన్న మూలప్రవృత్తికి-అదనంగా భగవంతునితో లీనమవ్వాలన్న ఉన్నత ప్రేరణే ఆధ్యాతికత. మనలో ఈ దైవికవాంఛను (తన నుంచి విడివడిన వారిని తనతో కలుపుకోవాలనుకుంటాడు సద్గురువు) మేల్కొలిపేది ఆధ్యాత్మికత. ఇది నెరవేరనంతకాలం నిజమైన





వహించడమా? ఇకనుంచి నా చిత్రపటాన్ని కూడా ఆది శంకరుల నుండి చంద్రశేఖరుల వరకు ఉన్న గురువులతో పాటు ఉంచి, జనబాహుళ్యం పూజిస్తుందా? వారికి నేను ఏ విధంగా సాటిరాగలను? వారి తపోమయ జీవితాలకు నేను సరితూగగలనా? శంకరులు అధిష్టించిన ఈ పీఠ గౌరవాన్ని నేను ఎలా నిలుపగలను"? ఇలా ఎంతో అంతర సంఘర్షణ.

స్వామినాథన్ సన్యాస స్వీకరణకు తల్లిదండ్రులు సంపూర్ణముగా సంసిద్ధులు కాని క్షణాలవి. కఠినమైన నియమనిష్ఠలతో, కాలనియమ కార్యక్రమములతో, ఆహార విహార నిషేధములతో, నిత్య పూజాదికాలతో సాగే ఈ కఠోర సన్యాస జీవితానికి ఏ తల్లిదండ్రులు సిద్ధంగా ఉండగలరు? తల్లిదండ్రులైన ప్రతి మనసుకు ఈ ఊహే అశనిపాతం. ఓ వంక మఠంలోని విద్యాధికులు వారిని ఊరడించి మీకింకా ముగ్గురు పిల్లలు ఉన్నారు కనుక అభ్యంతరం చెప్పవద్దని వినతి చేసారు ఆ దంపతులకు. గారాల పుత్రుడు కావడంతో ఆ దంపతుల వేదన వర్ణించలేనిది. వారు సమాధానమివ్వలేని స్థితి. అట్టి సంకట సమయంలో 'స్వామి'నాథన్ తన తల్లిదండ్రులతో ఇలా అన్నాడు **"నా సన్యాస స్వీకరణకు అంగీకారమివ్వడంలో తటపటాయించకండి. నా గురుదేవుల పూర్ణానుగ్రహం నాపై ఉంది. దానిని నేను చక్కగా సద్వినియోగం చేసుకుంటాను. నా హృదయంలో దాచుకుంటాను. మనఃస్ఫూర్తిగా మీ అంగీకారాన్ని తెలియచేయండి".**

ఈ మాటలు ఆ తల్లిదండ్రుల హృదయాలను కరిగించి వేసాయి. వారి తక్షణ అంగీకారాన్ని తెలియచేసారు. మరు నిమిషమే స్వామినాథన్‌కు శిరోముండనం చేసి వారి గురువుగారిచ్చిన కాషాయ వస్త్రాలను ధరింపచేసి, దండ కమండలాలను అందించడం జరిగిపోయింది.

సన్యాసాశ్రమ స్వీకరణ జరిగిన తరువాత పీఠ నియమం ప్రకారం తండ్రి మరియు బంధువులు సాధరణ ప్రజలవలే స్వామి దర్శనం చేసుకోవచ్చు. అయితే తల్లిగారికి మాత్రం ప్రత్యేక దర్శనం ఇవ్వవలెను. కంచి మఠాధిపతుల పరాదేవత కామాక్షి. వారు కామాక్షికి మాత్రమే నమస్కరిస్తారు. అయితే సన్యాసి తమ మాతృమూర్తికి మాత్రం తానే ముందు నమస్కరించాలి. ఇది నియమం. కనుక జగద్గురువులు నమస్కరించవలసి వస్తుందని వారికి ఆ తల్లి ఎదురుపడదు సాధారణంగా.

సాంప్రదాయకంగా సన్యాస స్వీకరణ చేసిన తర్వాత బంధువులకు, మాతాపితరులకు దూరంగా లౌకిక బంధాలకు అతీతంగా జీవించడం ఆశ్రమధర్మం. తమ దుఃఖ నివృత్తికై జనులందరూ వారి



పతనమయిపోతున్న జగత్తులో మన భావితరాలకు ఎలాంటి సమాజాన్ని అందించబోతున్నామో మనమందరం విశ్లేషించుకోవాల్సిందే! **తత్త్వదర్శినులైన సత్పురుషుల బోధలు - జీవిత చరిత్రలు అధ్యయనం చేయమని సద్గురుదేవులు చెప్పిన మాటల అంతరార్థం ఇదేనేమో! మకిలి పట్టిన మనసుని శుద్ధి చేసి మానవుడు-మాధవునిగా మారేందుకు, మహితాత్ముల నిత్య జీవితాలు శ్రేయోహితాలు.**


13 ఏళ్ళ బాలుడు కంచి శంకరాచార్యులుగా పీఠాధిపత్యం వహించాల్సిన క్షణం ఆసన్నమైంది. నిజానికి మొదటి కొన్ని కలయికలలోనే పూర్వాచార్యులైన శ్రీచంద్రశేఖర సరస్వతీస్వామివారు బాలుడైన 'స్వామి'నాథన్‌కు పీఠాధిపత్యము ఇవ్వాలన్న తలంపును ఆంతరంగిక భక్తులకు తెలియచేసి ఉన్నారు. సద్గురు వాక్యమునకు ప్రకృతి పరిణామము ఎలా ఉంటుందో, సద్గురుకృప కలిగిన వేళ బాలుడైనా - ఈశ్వరుడు కాగలడన్న సత్యమునకు ఇదిగో ఈ క్రింది సంఘటన తార్కాణము.

పీఠాధిపతులన్న గురుపరంపరలో అన్ని అంశాలను గురుముఖతః అభ్యసించి, ఆచరించి, గురు శుశ్రూష చేసి, క్రతువులను, యజ్ఞయాగములను, వేద, విద్వత్ సభలను, ధర్మసూక్ష్మ సందేహ నివృత్తిని, పీఠ పరిపాలనను, ప్రభుత్వ సంబంధిత-మతపరమైన విచారములను, జిజ్ఞాస, భక్తి మార్గములను అవలోకనము చేసి, ఆచరణాత్మక జీవన విధానాన్ని ప్రత్యక్ష సద్గురువు సాన్నిధ్యంలో నేర్చుకున్న తర్వాత పీఠ పరంపరలో జగద్గురువులుగా విలసిల్లడం జరుగుతుంది. ఈ క్రమంలో గురుసన్నిధిలో సాధన-శోధన జరిగి జగత్తుకోసం తనను నివేదనగా సమర్పించుకోవడం ఆచార్యుని వంతు.

అయితే 13ఏళ్ళ స్వామినాథన్‌కు పీఠపరంపరలోని సూక్ష్మములను, ఆచరణను బోధించేందుకు ప్రత్యక్ష గురుసన్నిధి లభ్యముగా లేదు. పూర్వాచార్యులు ఇద్దరునూ సమాధి రూపమును ధరించిన కఠిన సమయమది. వాచా బోధ చేసేదెవరు? కర్మణా చంద్రమౌళీశ్వర ఆరాధనను దర్శింప చేసేదెవరు? **మూడుపూటలా చక్కగా తల్లి ప్రేమ రంగరించి భోజనము చేసే బాలుడు - సాయంత్రమవగానే చెరువుగట్టున చెంగున దుమికి ఈదులాడే బాలుడు - సంధ్యావందనము తప్ప సమయగతి ఎరుగని బాలుడు - రాబోయే కాలానికి హిందూ ధర్మ పరిపాలుడు - ఎలా సాధ్యం? స్వామినాథన్ కంచి 'స్వామి'గా విలసిల్లడమా?** స్వామినాథన్ మానస హంసికా దర్శనం చేస్తే "నేను కంచి మఠ పీఠాధిపత్యం

నా గురువుగారు నాకు ఈ బాధ్యత అప్పగించారు. దాన్ని ఆయన ఆశీర్వచనంగా భావించి చేసాను. అంతే! అది నన్ను నా లక్ష్యంవైపుకు నడిపించింది. -శ్రీబాబూజీ





శాంతి లభించదు. దీనికి మార్గాన్ని కనుగొనలేక ఊరికే చర్చికి, మసీదుకీ, దేవాలయాలకు వెళతాము. ఆ మతం, ఈ మతం, ఆ మార్గం, ఈ మార్గం అంటూ అధ్యయనం చేస్తాం. ఈ గందరగోళానికంత కారణం మనమెవరో మనం తెలుసుకోకుండా ఇతరులకు మనల్ని పరిచయం చేసుకుంటున్నాం. మనకు మనమే అపరిచితమయినప్పటికీ మనం వివాహం చేసుకుంటాం. పిల్లల్ని కంటాం. ఇల్లు కట్టుకుంటాం. ఇతరులను ప్రేమిస్తున్నామని ప్రకటించుకుంటాం. ప్రపంచంలోని వస్తువుల్ని చూడడం, తెలుసుకోవడం మనం నేర్పుతున్నాము. మన పిల్లలకు చిన్నతనం నుంచి... నీ ముక్కు ఏది? నీ కన్ను ఏది? అనే వాటితో ప్రారంభించి, "నాది" అనే దాన్ని మనం మేల్కొలుపుతున్నాం. పంచేంద్రియాలు భగవంతుడిచ్చినవి, భగవంతుని చేరుకోవడానికి ఉపయోగించుకోవాలని తెలియచెప్పాలి. దీనినే 'లౌక్యం' అని, లౌకికమెరిగి మసలుకోవాలి అనే మాటలు వింటూ ఉన్నాం' అంటూ ఇలా మరపులోకి నెట్టేస్తున్నది జగత్తు. అలా మనల్ని జనన మరణాల చక్రంలోకి తోస్తుంది. మనమెవరం? ఎక్కడినుండి వచ్చాం? జీవిత పరమావధి ఏమిటి? ఎందుకీ జీవితంలోకి వచ్చింది? అంటున్నారు శ్రీసాయి. ఈ జ్ఞానం లోపిస్తున్నది."I belong to Baba. Baba belongs to me" ఈ విషయాన్ని ఎరుకలో నిలుపుకునే మార్గమే ఆధ్యాత్మికత. నిన్ను నీవు తెలుసుకోవడానికి నువ్వు ఎక్కడికో వెళ్లనక్కర్లేదు. స్థూలం నుంచి సూక్ష్మానికి, అక్కడి నుంచి సూక్ష్మాంతర స్థాయిల మార్గాన్ననుసరించాలి.

సజీవ మానవుడే అన్ని దేవాలయాలు, చర్చిలు, మసీదులకన్న అతిముఖ్యమన్న ఒకే ఒక సిద్ధాంతాన్ని అంగీకరించనంతకాలం మనం ఎన్ని గోపురాలు, చర్చిలు కట్టినా, తిరిగినా, చూసినా, చర్చలు చేసినా లాభం వుండదు.

**శృతుల ఘోష...దేహో దేవాలయ :-** మానవదేహం అన్ని దేవాలయాలలోను అతి ముఖ్యమైనది. లోనికి చూడు. అంతరంగాన్ని అన్వేషించు. అక్కడ నీ అంతరాళాలలో సార్వభౌముడు నివసిస్తున్నాడు. ఇది తెలుసుకున్నప్పటినుంచి నిజమైన ఆనందాన్ని పొందుతావు. దైవాన్ని నమ్మడం ఏమీ తప్పు పని కాదు. అది చాలా మంచివిషయం. కనీసం నమ్మకమున్నది. కానీ దైవం నీలోనే ఉన్నాడన్న విషయం ఎప్పటికీ మరువకు. (నీ సోర్స్ ఆఫ్ థాట్స్ కన్నా ఇంకా లోతులలో నేనున్నాను- శ్రీబాబూజీ)

ఏదైతే మనలను, మన ఆలోచనలను, మాటలను, చర్యలను అదుపులో పెట్టుకోవడంలో సహాయపడుతుందో, ఏదైతే మనల్ని సద్గురు చరణాల వైపు నడిపిస్తూ మన అంతర్గత సామర్థ్యాలను

**ప్రవర్తనను మార్చుకునే ప్రయత్నమే ఆధ్యాత్మిక సాధనకు బీజం.**



వెలికి తీస్తుందో అదే ఆధ్యాతికత. నిజమైన ఆధ్యాత్మికత మన ప్రవర్తనలో ఉంటుంది. మహాత్ముల జీవనాలలో ఈ ప్రవర్తనావళే ఆధ్యాత్మికతను మనకు చూపుతుంది. **దర్శించినది, విన్నది ఆచరణాత్మకం అయినప్పుడే మనం ఆధ్యాత్మికతలో ఉన్నవారమవుతాం.** (ఒక్క అడుగు తనవైపు వేస్తే - పది అడుగులు తాను వేస్తానన్న శ్రీసాయి ఇచ్చిన అభయం, శ్రీబాబూజీ చేసిన అన్వేషణాపథంలో ఆచరణాత్మక రూపం ధరించింది) అటువంటి ఆధ్యాత్మికవిద్య మానవుడిని స్వయంశక్తితో, ఆత్మవిశ్వాసంతో బాహ్య ప్రపంచంలో చురుకైన వ్యక్తిగా చైతన్యవంతునిగా రూపుదిద్దుతుంది. అదే సమయంలో మానవాళి తన ప్రాపంచిక దృక్పథాన్ని విస్తృతం చేసుకోవడంలో (అంతటా అన్నిటా వున్న చైతన్యాన్ని దర్శించేలా) సహాయపడి, శాశ్వత సత్యాన్వేషణలో వెళ్లడానికి దోహదపడుతుంది. మన బాహ్య, అంతర్గత జీవితాలలో పొందికైన సమత్వం తీసుకురాగలిగినదే ఆధ్యాత్మికత. "ఆధ్యాత్మికతలో మనోనిగ్రహం, సంయమనం అత్యావశ్యకాలు. సంయమనం సాధించకపోతే సంపూర్ణ శరణాగతి సున్నా"! అంటారు శ్రీబాబూజీ. దైవ ఉనికిని తెలిపే సిద్ధాంతాల జ్ఞానం, క్రమశిక్షణ నేర్చుకోవడం కన్నా ముఖ్యంకాదు. ఈ క్రమశిక్షణ మనకు దైవం యొక్క ప్రత్యక్షానుభూతిని కలిగిస్తుంది.

భౌతికానికి, కోడిగుడ్డుకు పైపెంకు ఉన్నట్టుగా హద్దులున్నాయి. ఆధ్యాత్మికతకు అనంత క్షితిజం, హద్దుల్లేని స్వేచ్ఛ ఉన్నాయి. అది విజ్ఞానంతో (జ్ఞానాన్ని ఉపయోగించుకోవడం- కంప్యూటర్‌ని మనం కనుక్కోలేదు. కాని దాన్ని ఉపయోగ పెట్టుకొని ఇంకా అభ్యుదయంలోకి పోవడం. ప్రగతిని పొందడం.) నిరంతర శాంతి, ఆనందాలతో జీవితం నిండి ఉంటుంది. ఎప్పుడైతే వ్యక్తి సంపూర్ణ నిర్లిప్త భావంతో ఉంటాడో అప్పుడు తాను సర్వాంతర్యామితో విశాలమైన, గహనమైన బాంధవ్యంలో ఉన్నదానికి గురుతు. ఎప్పుడైతే అహం (నేను) దానికన్నా ఉన్నతమైన దాని గురించి, మహాత్ముల గురించి జాగరూకత పొందుతుందో అప్పుడు ఆధ్యాత్మికత వ్యక్తమవుతుంది. ఎప్పుడు ప్రత్యేక వ్యక్తిత్వం అంతరిస్తుందో - అప్పుడు ఆధ్యాత్మికత ఉదయిస్తుంది.

మానవజాతి యావత్తు దుఃఖాగ్నిలో తపిస్తూ ఏడవాల్సిన గతి పట్టకుండా అశాంతి నుంచి, కష్టాలనుంచి, దుఃఖమునుంచి తప్పించి తృప్తి, శాంతి, ఆనందాలతో జీవితానికి సంపూర్ణ వికాసం చేకూర్చేదే ఆధ్యాత్మికత. మహాత్ములు ఏది సాధించేందుకు అంకితమైనారో, ఏది సాధించడానికి అంకితంకమ్మని ఉద్బోధించారో అట్టి శాశ్వతానందం చేకూర్చేదే ఆధ్యాతికత. **ఆధ్యాత్మికత అంటే ఏదైతే మన ఆలోచనలకు, మాటలకు, ఆచరణకు సామ్యతనిస్తుందో అది ఆధ్యాత్మికత.**





కింగ్ ఆర్థర్ వంటి పాత్రను ధరించిన నవీన నేపథ్యము, బ్రిటీష్ వారి కొలువులో తండ్రి సుబ్రహ్మణ్య శాస్త్రిగారి ఉద్యోగ ధర్మము, తల్లి మహాలక్ష్మమ్మగారి గారాలపట్టి, తండ్రిగారికి తనపేరు నిలబెట్టగలడన్న విశ్వాసపాత్రుడు.. ఇదీ 'స్వామి'నాథన్ నేపథ్యం. అట్టి ఆ చిన్నారి తల్లిదండ్రుల జీవితాలలో మిన్ను విరిగి మీద పడిందా అన్నట్లు 13 ఏళ్ళ బాలునికి సన్యాసాశ్రమ సంప్రాప్తము, ఆదిశంకరులు అధిష్ఠించిన పీఠమునకు సార్వభౌమత్వము. చిదంబర అగ్నిప్రమాద పర్యంతము ఎన్నడునూ తన బిడ్డను వీడనన్న మహాలక్ష్మమ్మగారి మానసిక స్థితిని ఊహించిన కనులు అశ్రువులతో నిండి కంఠము గద్గదము అవుచున్నది కదా! అమ్మా! మీ పరిత్యాగము అనుపమానము, అద్వితీయము! సుగుణాభిరాముని కన్న త్రేతాయుగ కౌసల్యాదేవికి సాటి మీరు! ఎందరో బద్ధ జీవులలో భగవంతుని ఉనికిని ప్రసరించిన 'స్వామి'నాథన్‌ను (మాకు) భరతజాతికి అందించిన మీకు మా శతకోటి నమస్సులు. సద్గురు అనుగ్రహం అందరిమీదా వర్షిస్తుంది. అయితే అది కుండపోతగా మీ కుటుంబంపై వర్షించింది. త్యాగము వల్లనే మనిషికి అమృతత్వము లభిస్తుంది అన్న శృతివాక్యమునకు మీ కుటుంబము ఒక గొప్ప సోదాహరణము. **అమ్మా! మీరు నిర్మించిన ఈ పరిత్యాగాల పర్ణశాలలు-భగవంతుడు సద్గురు స్వరూపంతో సదా వసించే పాఠశాలలు.**

పూర్వాపరాలను విచారిస్తే 'స్వామి'నాథన్ తాతగారు గణపతిశాస్త్రిగారు కంచి మఠమునకు సుమారు అర్ధ శతాబ్దంపాటు సర్వాధికారిగా పనిచేయడం జరిగింది. వారి సమయంలో ఎన్నో అవాంతరాల మధ్య కూడా వారు మఠవ్యాప్తి కొరకు ఎంత కృషి సల్పిరి. వారు మఠమునకు, ఆచార్య స్వాములకు చేసిన సేవ అద్వితీయము-అసామాన్యము. 65వ పీఠాధిపతులైన శ్రీమహాదేవేంద్ర సరస్వతీస్వామివారు, గణపతిశాస్త్రిగారి సోదరుని కుమారులు. 67వ పీఠాధిపతి అయిన శ్రీమహాదేవేంద్ర సరస్వతీస్వామివారు మహాలక్ష్మమ్మగారి సోదరి కుమారుడు.

ఇలా వారి కుటుంబమంతా కంచి పీఠమునకు పరంపరగా అంకితమయినదనడంలో అతిశయోక్తి లేదు. నా హృదయ వేదదను పాఠకులకు నివేదనగా విన్నవించుకునే చనువును తీసుకుంటున్నాను. 'స్వామి'నాథన్ వంటి ముక్కుపచ్చలారని యువకుని ఈ జాతికి జగద్గురువుగా అందించిన త్యాగమయ కుటుంబాల నుంచి మనం నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. విలువల వలువలు విసిరివేసి సాటి మానవుడిని ఆదుకోక, ఎదుటివాడి ఎదుగుదలను ఓర్వలేక,

**బాధ్యతలెరిగిన చోట సంస్కారముండును. హక్కులెరిగిన చోట సంస్కారముండదు.**



విదితా నమయా విశదైక కలా
నచకించన కాంచన యస్తి గురో
ద్రుతమేవ విదేహి కృపాం సహజాం
భవ శంకర దేశిక మే శరణం

"గురుదేవా! ఏ కళయందును నాకు పూర్ణ ప్రతిభ లేదు, నాకు ఐశ్వర్యమూ లేదు. సహజమైన నీ కరుణను శీఘ్రముగా నాపై ప్రసరింపుము. గురుదేవా! శంకరా! మీరే నాకు శరణు". శాస్త్ర ప్రావీణ్యము అవసరం లేని గురుశరణాగతి తత్త్వము తోటకుని వృత్తము – అది చేయగలదు మన సందేహచిత్త నివృత్తము.

మద్గురుదేవులు, పూజ్యపాదులు, కరుణాంతరంగులూ శ్రీశరచ్చంద్రుల జీవితమే ఇందుకు తార్కాణము. వారి జీవితమంతయ గురుస్మరణమే! వారి జీవనమంతయూ పరమగురువు శ్రీసాయినాధుని శృతివాక్య పాలనమే! వారికి శ్రీసాయి అనుగ్రహమే ఉచ్ఛ్వాసనిశ్వాసలై ఉండెను. వారు వారి గురుని మరచిన క్షణము లేకుండెను. ఎన్నడునూ వారు తర్క, మీమాంసలకు తావివ్వకుండెను. శ్రీసాయి మాటలే వారికి బాటలయ్యెను. శ్రీసాయి వర్తనమే వారి ప్రవర్తనమయ్యెను. తుదకు సాయి సాయి అంటూ వారు మాకు ఆనందస్వరూపుడైన శ్రీసాయియే అయ్యెను. శ్రీసాయి వారికి సమస్తముగా భాసించెను. శ్రీసాయి భాస్కరుని అతులిత శక్తి పుంజములు శరశ్చంద్రుని వలె పూర్ణముగా మా మనములను చల్లబరిచెను. అజ్ఞానాంధకాములతో, అల్పబుద్ధులతో, రసహీన మతులతో, చీకట్లు కమ్ముకున్న ఎందరో మాబోంట్లను వారి అనుగ్రహ ఆనందాంబుధిలో ఓలలాడించిన ప్రేమ స్వరూపులు మా గురుదేవులు. మాలో లవలేశము ప్రేమ స్రవించినా అది కేవలం మూర్తీభవించిన కరుణ అయిన మా గురుదేవుల కృపావిశేషమే! 'గురుకృపా' విశేషము మానవుని–మాధవునిగా, చిన్నారిని–చిన్మయునిగా, బాలుని–భగవంతునిగా, వ్యక్తిని– విశేషముగా, పరివర్తన గావించగలదన్న సత్యమునకు శ్రీచంద్రశేఖరుల దివ్య చరితము మరో 'గురుకృపా భాష్యమని' నిస్సందేహముగా చెప్పగలము.

ఇతఃపూర్వం సంచికలలో స్వామినాథన్ గురించి ప్రస్తావించుకున్న అంశముల సింహావలోకనము– 13 ఏళ్ళ బాలుడు, మిషనరీ స్కూలులో ఆంగ్ల విద్యాభ్యాసము, బైబిల్ కంఠోపాఠం,





**మతాలు అన్న దురవగాహనలో చిక్కుకుంది సమాజం. ఈ మతాల, చిహ్నాల సంకుచిత తత్వాలనుంచి మానవాళిని తప్పించడానికి రంగులేని తేజస్సులా అవతరించారు శ్రీసాయి. గాలిలా, వెలుగులా, ఆకాశంలా ఆయనకు మతం లేదు. చెట్టు ఇచ్చే నీడదీ, చంద్రుడిచ్చే వెన్నెలదీ ఏ మతమో ఆయనదీ అదే మతం. ఆయన ఈ విశ్వానికి ప్రతీక. ప్రకృతికి ప్రతీక. ఈ విశ్వం అందరిదీ. ఆయనా అందరివాడే. అందుకే ఆధ్యాత్మికతకు మరో పేరు సాయి. అత్యంత విలువైనది మానవజీవితం. ఎందుకంటే ఇది భగవత్ ప్రసాదం కనుక. అట్టి విలువైన జీవితాన్ని విలువలతో జీవించాలి అంటారు మహాత్ములు. మనందరికీ వారి ఆచరణతో ప్రభోదిస్తున్నదీ అదే. చూడటం (Seeing) ఉండటం (Being) అనుభూతి చెందడం (Experiencing) ఇవన్నీ కలిస్తే దర్శనం –శ్రీబాబూజీ. ఆ దర్శనమే నిజమైన దర్శనం. అట్టి ఆచరణానుభూతే నిజమైన అనుగ్రహం. దర్శనానుగ్రహమంటే ఇదే.** **– గురుకృప**

## శ్రీబాబూజీ

పూర్వజన్మ సంస్కారమో ఏమో తెలియదుగానీ ఊహ తెలిసినప్పటి నుంచి కనిపించిన పటానికంతా మొక్కడం, గుళ్లుగోపురాలు తిరగడం, పూజాపునస్కారాలతో కాలం గడపడం, వయస్సు పెరిగే కొద్దీ స్వాములు, ఆశ్రమాల చుట్టూ తిరగడం సాధువులను దర్శించి వారి బోధనను వినడం, వారిని ప్రశ్నించడం, ఎందరో సన్యాసుల ఆధ్యాత్మిక ప్రసంగాలను వినడం హిందూమతానికి ప్రమాణ గ్రంధాలైన రామాయణ, భారత, భాగవతాలను చదవడం, ఉపనిషత్ సారమైన భగవద్గీతను పారాయణ చేయడం, అర్థతాత్పర్యాలతో చదవడం, గీతోపన్యాసాలకు క్రమం తప్పకుండా హాజరు కావడం, ఉపన్యాసకులు చెప్పింది శ్రద్ధగా వినడం, విన్న దానిని మననం చేసుకోవడం, అదే ధ్యాసలో గడపడం చిన్నప్పటి నా ప్రవృత్తి.

మొత్తంమీద నేను అర్థం చేసుకున్నది గురువు లేకపోతే ఏ సాధనా ఫలించదని. సాక్షాత్ శ్రీకృష్ణుడే భగవద్గీతలో జ్ఞానుల వద్దకు పోయి నమస్కరించి, సేవించి, ప్రశ్నించి నీకు కావలసిన జ్ఞానాన్ని పొందు అంటుంటే మనంతట మనం సాధించేది ఏమిటి? అన్న ప్రశ్న తొలుస్తుండేది. ఉపన్యాసాలు చెప్పే సాధుసన్యాసులు జ్ఞానులా అంటే వాళ్ల ఆడంబరం, అట్టహాసాల వల్ల వీళ్లు



జ్ఞానులు కాదని అనిపించేది. అయితే పరిపూర్ణ జ్ఞానం పొందిన సద్గురువు ఎవరు? వారిని ఎలా గుర్తించాలి? వారిని ఎలా సేవించాలి? ఎలా ప్రశ్నించి జ్ఞానాన్ని తెలుసుకోవాలి అనే ప్రశ్నలు నాలో అశాంతిని కలిగించి కనిపించిన స్వాముల వద్దకంతా పోయి నాకు జ్ఞానాన్ని ఇచ్చే గురువు వారిలో దొరుకు తారేమోనని ఆశగా తిరిగేవాడిని. ఏది ఏమైనా గురువు మార్గదర్శకత్వం లేకుండా ఎవరూ దేనినీ సాధించలేరు అన్న పూర్తి నమ్మకంతో సద్గురు అన్వేషణ ప్రారంభమై ఒకవైపు చదువుకుంటున్నా ఇంకోవైపు అన్వేషణ కొనసాగుతుండేది. నా అన్వేషణకు ఫలితం సాయిబాబా అన్న సద్గురురూపం నాకు దొరకడం, వారి గురించి ఏమీ తెలియకపోయినా కేవలం వారి రూపాన్ని చూచి ఆకర్షితుడనై వారిని ఆరాధించడం జరిగింది. నెమ్మదినెమ్మదిగా బాబానే వారి గురించి ఎందరో సాయిభక్తుల ద్వారా నాకు తెలిపారు. వారి చరిత్రను చదువుతున్నపుడు వారి నోటినుంచి వెలువడిన ఒక సూక్తి నన్ను ఆశ్చర్యపరచింది. “నా భక్తుని నేనే ఎన్నుకుంటాను. వాళ్లు ఎంత దూరాన ఉన్నా సరే పిచ్చుక కాలికి దారంకట్టి లాగినట్టుగా నేను నా వద్దకు లాక్కుంటాను” అని. అంటే సాయిబాబా లాంటి సద్గురువును నేను పట్టుకోవడం గాదు వారే నన్ను ఎన్నుకొన్నారు. నా కోరికకు ఒక రూపం ఏర్పడింది. సాయిబాబా మార్గంలోనికి వచ్చిన తరువాత సమర్ధ సద్గురు స్వరూపుడైన సాయినాధుని ద్వారా పొందిన అనుభవాలు కోకొల్లలు. మనస్సులో వచ్చిన ఏ కోరిక అయినా బాబాను తలచుకొని అది తీరాలని ప్రార్ధిస్తే తీరిపోయేవి. సాక్షాత్ భగవంతుడే సాయిబాబాగా అవతరించారన్న సత్యం కొంచెం కొంచెంగా అవగాహన కావడం మొదలైంది.

కాని చిన్నప్పటినుంచి నేను ఎన్నో గ్రంధాలు చదివి, ఎన్నో ఉపన్యాసాలు విని ఏర్పరచుకొన్న భావం ఏంటంటే మనం జ్ఞానాన్ని పొందాలంటే ఆ స్థితిని పొందిన జ్ఞాని వద్దకు పోవాలని వారితో మాట్లాడి, ప్రశ్నించి, అనుమాన నివృత్తి చేసుకొని వారి మార్గదర్శకత్వంలో సాధన చేసుకోవాలని, వారిని సేవిస్తూ వారి కృపవలన జ్ఞానాన్ని పొందాలన్న కోరికకు సమగ్ర రూపం ఇంకా ఏర్పడలేదు. అంటే సజీవమైన సద్గురువు లేకుండా సాధన జరగదు అన్న అభిప్రాయం ఏర్పడివుంది. అందుకనే మహామహిమాన్వితుడు సద్గురు సామ్రాట్ అయిన సాయినాధుడు తమకు ప్రతిరూపమైన సద్గురు సాయినాధుని శరత్‌బాబూజీగారిని నాకు నియత గురువుగా చేసి వారు చూపిన మార్గంలో నేను పయనిస్తూ సాయినాధుని అనుగ్రహాన్ని పొందాలని నన్ను శ్రీబాబూజీ దివ్యసాన్నిధ్యానికి తీసుకొనిపోయి





## గురుకృపాలహరి

“ఏ సాధనలుగాని యారు శాస్త్రములలో ప్రావీణ్యముగాని యవసరము లేదు. నీ గురువునందు ప్రేమ విశ్వాసముల నుంచుము. గురువే సర్వమును చేయువాడనియు, కర్తయనియు పూర్తిగా నమ్ముము. ఎవరితే గురువు యొక్క మహిమను, గొప్పతనమును గ్రహించెదరో, ఎవరయితే గురుని బ్రహ్మ, విష్ణు మహేశ్వర స్వరూపుడని యెంచెదరో వారే ధన్యులు”. ఇది సద్గురు సాయి వచించిన గురుశ్రుతి, గురుస్తుతి, మనకు శుభ్రమార్గమును చూపిస్తూ – బిడ్డలకు వారందించిన సుబోధా‘కృతి’. గురువే సర్వమని, గురువే కర్తయని నమ్మి నడిచిన వాడికి సద్గురు చరణం సంప్రాప్తిస్తుంది. సదా ఆ సద్గురు స్వరూపుని తోడు లభిస్తుంది. కలిమి–బలిమిలకు ఆ కార్యకారణుడే కావలిగా నిలుస్తున్నాడు. త్రోవకు దీపస్థంభం దారి చూపితే – జీవితమనే నావకు గురువు దారి చూపిస్తున్నాడు. గమ్యాన్ని చేరుస్తున్నాడు – సద్గురు కృపాదృష్టి అందరిమీదా వర్షిస్తుంది. కానీ అజ్ఞానాన్ని తొలగించుకొని, కళ్ళు‘తెరచి’ చూసిన వారు అడుగు ముందుకు వేసారు. అట్టి ఆదర్శపురుషులు హరి!... హరి!... అంటూ హరి హరుడే అయినట్లే గురుస్మరణలో జగద్గురువులుగా భాసించారు. ప్రాతఃస్మరణీయులై గురు అనుగ్రహ పతాకను ఆసేతు హిమాచలం కన్పించేట్లు ఎగురవేసారు. గురుస్వరూపులారా! ఇది యంతయు అప్రస్తుత ప్రసంగముగ భావించవలదు. సద్గురు చరణాలలో జీవితాన్ని అర్పించిన మానవజీవితము మహోన్నతముగా, మహిమాన్వితముగా, మారుననుటందులకు మహానుభావులు, జగద్గురువులు శ్రీచంద్రశేఖర సరస్వతీస్వామివారి జీవితమే సజీవ సాక్ష్యము. మిక్కిలి దర్శనీయము – నిత్యస్మరణీయము. అనుగ్రహ పూర్ణచంద్రుడైన గురుని కృపా వెలుగులలో – ఎట్టి అంధకారమైనా పటాపంచలు కావలసినదే కదా! సద్గురు సేవా తత్పరుడై, గురుశుశ్రూషాంకితుడై – అల్పజ్ఞుడైనను, బుద్ధికుంఠితుడైనను సద్గురుని ప్రేమ, విశ్వాసములతో, ఆర్తితో ఆశ్రయించిన తోటకుడు–తోటకాచార్యునిగా విలసిల్లిన భరతజాతి సుజలాం, సుఫలాం అంటూ భాసించి తీరుతుంది. భరతజాతి ఆస్తిక్యమంటే ఆచంద్రతారార్కమైన ఎందరో సద్గురు చంద్రుల అమృత అనుగ్రహజలాలు, ఈ జాతికి గురుపరంపరలో (తో) వారందించిన మహాత్ములనే ఫలాలు. ఇదే మన నిజమైన అస్తి, ఆస్తి...

తోటకాచార్యుల స్ఫురణ, శ్రీసాయి మాటల స్మరణ, మా గురుదేవుల ప్రేమావతరణ ఇదిగో ఇందుకు వచ్చింది.



పదార్థం వల్లే మొత్తం తేడా వస్తుంది. మనం తయారుచేసే, సృష్టించే, ఉత్పత్తి చేసే అన్నిటిలోనూ కనిపించని ఒక పదార్థం ఉంది. అదే మెరుగైన అత్యుత్తమమైన తేడాలని సృష్టిస్తుంది. సాధారణానికి, అసాధారణానికీ మధ్యనున్న తేడాని కనిపించేట్టు చేస్తుంది. బావుంది, అద్భుతంగా ఉంది అనే భిన్నమైన భావనలని కలిగిస్తుంది. ఆ పనిని ప్రేమగా, ఆనందంగా చేసారా లేక అయిష్టంగా, ఉపేక్షతో చేసారా? చేసిన ఏ పనిలో అయినా మనసు లగ్నం కావడం అనేదే ఆ కనిపించని పదార్థం. చేసే పనిలో మనసు 101శాతం నిమగ్నమై ఉందా, అనేదే కీలకమైన ప్రశ్న. నేనొకసారి మా అమ్మాయితో, “కుట్టీ, వంట చేసేట్టుంటే సంతోషంగా చెయ్యి. లేకపోతే అసలు చెయ్యనే వద్దు. నాకు రుచిలో తేడా తెలిసిపోతుంది. వడ్డించే పదార్థాల్లో జీవం ఉంటుంది, అది లేనప్పుడు అవి కేవలం జడపదార్థాలే! దాన్ని వండటం మనసుపెట్టి చేసిన పనా కాదా అనేదే ఆ తేడాని సృష్టిస్తుంది.” అన్నాను.

శ్రద్ధ, భక్తి అనే గుణాలు కేవలం దేవాలయాల్లోనూ, ప్రార్థనాస్థలాల్లోనూ చూపడానికే దాచి ఉంచుకోవలసినవి కావు. మనం చేసే ప్రతి పనిలోనూ శ్రద్ధాభక్తులు ఉండాలి.... మనసుని 101శాతం లగ్నం చేసి పనిచెయ్యటమే శ్రద్ధ అంటే. అంకితం చేసేప్పుడు మన దగ్గరున్నది, ఇవ్వగలిగినదీ మాత్రమే ఇస్తాం. శ్రద్ధాభక్తులున్నపుడు. మిమ్మల్ని మీరు సమర్పించుకుంటారు. శ్రద్ధ అనే పవిత్రమైన భావంతో చేసిన ఏ పనైనా ప్రార్థనగా మార్పు చెందుతుంది. శ్రద్ధ, భక్తి అనే గుణాలు – ఏకాగ్రత, సంతోషం, ప్రేమవల్ల అబ్బుతాయి. ఖచ్చితత్వం, కార్యసాధక తంత్రం, ప్రత్యేక గౌరవాన్ని అందుకోవటం కేవలం శ్రద్ధాభక్తులవల్లే సాధ్యం. అలసటా, శ్రద్ధా విలోమానుపాతం గలవి. మనం చేసే ప్రతిపనినీ ఆరాధనాభావంతో మొదలుపెట్టినప్పుడే ప్రకృతి తాలూకు అప్రకటిత నియమాలలో ఒకటైన, ‘మనిషి అలసిపోయేట్టు నిర్మించబడలేదు’ అనే నియమాన్ని గ్రహిస్తాం. అలసట ఎరగని మనిషి ఎవరైనా మీకు పరిచయం ఉంటే, చేసే ప్రతిపనీ తన శ్రద్ధాభక్తుల అభివ్యక్తీకరణగానూ, చేసే పనులన్నీ ప్రార్థనగానూ అతను భావిస్తాడని తెలుసుకోండి.

Teaching has value when applied. బోధ విలువ తెలిసేది, పెరిగేది అభ్యాసం వలననే. మానవప్రయత్నమే దాని తాళంచెవి.

సేకరణ : **పోస్టు చేయని ఉత్తరం**





వదిలారు. వారి దర్శనంతో, సంభాషణలతో, నడవడికతో నాలో వున్న అసమగ్రమైన భావం పోయి సమగ్రమైన గురుభావం నెలకొని, గురువుగారు చూపుతున్న ఆదరణల వలన అది బలపడింది. వారి కలయికతో నా అన్వేషణ పూర్తయి, నాకు జ్ఞానాన్ని ఇచ్చే జ్ఞానభాస్కరులు వారేనన్న స్థిరమైన అభిప్రాయం ఏర్పడింది. సద్గురువు అన్న పదానికి నిరూపణ లభించింది.

సద్గురువంటే ఈ లోకానికి అతీతమైన స్థితిలో ఉండి మనకు అందనంత దూరంలో ఎత్తైన ఉన్నత శిఖరాలను అధిరోహించిన స్థితిలోగాని వుండి మనలను తనంత ఎత్తుకు ఎదగమని బోధించే వారు కాదు. మనలో ఒకరుగా ఉంటూ (మన స్థాయికి దిగి వచ్చి) మన కష్టాలకు స్పందిస్తూ, మన సమస్యలు తమ సమస్యలుగా చేసుకొని వాటిని తీరుస్తూ, ప్రాపంచిక వ్యామోహాలతో కొట్టుకునే మనలను వాటినుంచి మనకు తెలియకుండానే బయటపడేస్తూ మన స్థితిని అర్థం చేసుకొని మనకు తగినవిధంగా బోధిస్తూ, మనలను సరైన దారిలో గమ్యం చేర్చు మార్గదర్శి అని గురుదేవుల పరిచయభాగ్యం వలన అర్థమైంది.

వారి ఉన్నతస్థితిని చూసి వారిని సమీపించాలంటేనే ఏదో తెలియని భయం లేకుండా మనలను తనవారిగా ఆదరిస్తూ దగ్గరకు తీసుకొని ప్రేమగా లాలించే వారిని చూస్తే నాకు ఎంతో ఆశ్చర్యమేసేది. ఒకవైపు వారినుండి పొందే అనుభూతులు వారిని సాక్షాత్ సాయినాధుని ప్రతిరూపం అన్న భావాన్ని కలిగించేవి. ఇంకోవైపు వారు మనలాగా ఉంటూ, ఎటువంటి ఆడంబరాలు లేకుండా ఎంతో సాధారణంగా మనలను నవ్విస్తూ, వారు నవ్వుతూ ఎంతో ఆహ్లాదంగా ఉండడం చూచినపుడు వారి ఆ అద్భుతస్థితి కనుమరుగయ్యేది. ఇలా రెండుభావాలు ఒకదాని వెంట ఒకటి కలగలసిన ఒక విచిత్రమైన స్థితిలో కాలం గడిచిపోయేది. ఏ సద్గురువైనా తనంతట తానుగా ప్రకటంకారు. మనమే వారి దివ్యత్వాన్ని గుర్తించి వారిని గురువుగా భావించుకొని వారి మార్గదర్శకత్వంలో నడవాలి.

ఎన్నో అద్భుతమైన లీలలు సద్గురు సాయినాధుని రూపంనుంచి ప్రకటమైనా వారు మాత్రం “నేను అల్లా సేవకుడను మాత్రమే. అల్లాయే నా యజమాని” అనేవారు. అదేవిధంగా గురుదేవులు నేను సాయినాధుని సేవకుడిని మాత్రమే బాబా ఎక్కడ? నేనెక్కడ? అంటారు. గురుదేవులు నిరంతరం సమర్థసద్గురు సాయినాధుని ధ్యాసలో, సేవలో, ధ్యానంలో గడపడం మనం ఇప్పటికీ చూడవచ్చును.



భగవద్గీతలో కృష్ణుడు తద్విద్ధి ప్రణిపాతేన అన్న శ్లోకంలో జ్ఞానం పొందతలచినవారు జ్ఞానుల వద్దకు పోయి ప్రశ్నించి, సేవించి జ్ఞానాన్ని పొందాలని అంటారు. జ్ఞాని బోధించేది అజ్ఞానమేగాని జ్ఞానం కాదని, అజ్ఞాన సగోచరమైన జ్ఞానాన్ని బోధించడం వీలుపడదని, బోధ అంతా అజ్ఞానమే అని మనలోని అజ్ఞానాన్ని గురుబోధతో తొలగించుకుంటే మిగిలేది జ్ఞానమేనని బాబా వ్యాఖ్యానం. సాయిలీలామృతంలో చదివినప్పుడు ఎంతో అద్భుతంగా అనిపించింది. అటువంటి అజ్ఞానాన్ని బోధించే గురువువలననే జ్ఞానాన్ని పొందగలము అనిపించింది.

సద్గురు సాయినాధుని కృపావిశేషం వలన అటువంటి గురువు దొరికితే నా జన్మ తరిస్తుందని కోరుకునేవాడిని. నా కోరికను సాయినాధుడు ఎంతో అద్భుతంగా తీర్చారు. నిజమైన జ్ఞాని తను జ్ఞానినని మిగిలినవాళ్లందరూ అజ్ఞానులని, తనను ఆశ్రయించిన వారు శిష్యులని అనుకోడు. సర్వత్రా సర్వజీవులలోను తననే చూచుకొంటారని విన్న శాస్త్రవాక్యం నాకు బాబా కృపావిశేషంగా లభించిన నా గురుదేవుల విషయంలో అక్షరాలా నిజమైంది.

నిరంతరం సాయినామ స్మరణలో పునీతులై, సాయి ధ్యాసలో, సాయి ఊసులో మునిగిపోయి అనితర సాధ్యమైన సాయినాధుని అద్భుతస్థితిని పొందగలిగిన భాగ్యశాలి వారు. కీటకం భ్రమరమైనట్టు బాబాను ధ్యానించి బాబాకు, వారికి భేదంలేని అబేధస్థితికి చేరిన మహానుభావులు గురుదేవులు. అటువంటి అత్యుత్తమ ఆధ్యాత్మిక శిఖరాలను అధిరోహించినా మానవాళిపై కరుణతో సామాన్య మానవునిలాగా మన మధ్య ఉంటూ, పరిపూర్ణ మానవత్వంతో మూర్తీభవించిన మానవతా స్వరూపంగా మానవాళి ఉద్ధరణకు కంకణం కట్టుకున్న మానవోత్తములు వారు. వారు సాటిజీవులపై చూపే ప్రేమ, అప్యాయత, ఆదరణ ఎంతగా నాపై ప్రభావాన్ని చూపాయంటే మనిషిగా వారిముందు నిలబడాలంటేనే సిగ్గు అనిపించి కనీసం వారు చూపించిన మానవత్వంలో నూరవవంతైనా చూపి తరించాలని అనిపించేది. ఎవ్వరు ఏ కష్టంలో ఉన్నా చలించిపోయి, సహాయం కోరిన వెంటనే తన పరిధిని మించి చేస్తూ సలహా అడిగితే ఏమీ ఆశించకుండా వెంటనే వారి అమూల్యమైన సలహాలను ఇస్తూ ఎప్పుడూ సాటిజీవికి సహాయపడాలనే తపన నాకు గురుదేవులు పరిచయం అయిన నాటినుంచి నేటివరకు చూస్తూనే ఉన్నాను. గురువుగారిని ఎవరైనా ఏదైనా పని చేసిపెట్టమని కోరారా ఇక వారిపని అయిపోయినట్లు. కోరిన వ్యక్తి చేసుకొనేదాని కన్నా ఆ పనిని గురించిన పూర్తి





గమనించావా చెప్పడానికి
లేక కర్మ కాలిపోయినట్టు కూర్చున్నావా!
ప్రేమలు, నవ్వులు, కన్నీళ్లు చూసావా
లేక అంటీ ముట్టనట్టు జీవితాన్ని ఆమడదూరంలో ఉంచావా!
సంవత్సరాలు గడిచిపోతాయి... నువ్వు సంతోషంగా ఉన్నా బాధగా ఉన్నా
ఆటలాడుతున్నా దొర్లుతున్నా... కాలం ఇసుకలా జారిపోతూనే ఉంటుంది!
ఈ నూతన సంవత్సరంలో నువ్వెదగాలి.....మెరవాలి... ఆ తపనతోనే తొందరపడాలి...

**– ప్రేమాశీస్సులతో సద్గురు**

## శ్రద్ధ

భక్తుడు : శ్రద్ధగా పనిచేయడం అంటే?

శ్రీబాబూజీ : శ్రద్ధ అంటే ఒక పని చేసేటప్పుడు ఆ ఒక్క పని పైనే దృష్టి, ఏకాగ్రత నిలపడం. ఒక పనిని కొరత లేకుండా సంపూర్ణంగా చేయాలి. ఒక పని చేసేటప్పుడు దాని అవశేషాలేమి వుండకూడదు. పశువులు నెమరువేసే విధంగా పనులు చేయకూడదు. ఆవు కాని, గేదె కాని ఏం చేస్తాయి? దొరికిన గడ్డిని ముక్కలు ముక్కలుగా చేసి నమలకుండానే త్వరత్వరగా మింగేస్తాయి. అదలా ఎందుకు చేస్తుంది? అప్పుడు దొరికిన గడ్డి తర్వాత దొరకదని దాని భయం. తర్వాత నింపాదిగా కూర్చొని ఆహారాన్ని తిరిగి నోటిలోనికి తెచ్చుకొని బాగా నమిలి మ్రింగుతుంది. మనమూ అలాగే చేస్తుంటాము. మనకెదురవుతున్న చింతలు, ఆతురతలు, భంగపాట్లు, భయాల వల్ల ఇలా జరుగుతుంది. ఇలా ఆవు, గేదెలవలె తొందరపాటుతో అన్ని పనులు ఒకేసారి చేయకండి. నెమ్మదిగా తిని ఆస్వాదించి మానవునిలా జీవించండి. ***సాయిదీవెన పే.నెం. 353***

***పనిచేస్తే పూర్తి శ్రద్ధతో చెయ్యండి, లేకపోతే చెయ్యకండి. మధ్యరకంగా మాత్రం చెయ్యొద్దు.***

ఒక నిమ్మకాయని తీసుకొని రెండుముక్కలుగా మధ్యలో కొయ్యండి. రసం పిండే పరికరంతో గ్లాసులో వాటిని పిండండి. అవసరమైనంత పంచదార, చిటికెడు ఉప్పు (సైంధవలవణం అయితే మరీ మంచిది) చేర్చండి. గ్లాసుని చల్లటినీటితో నింపి బాగా కలపండి. నిమ్మకాయరసం సిద్ధం. ఇది చెయ్యటం చాలా తేలిక. కానీ ఏ ఇద్దరు చేసిన నిమ్మరసం రుచీ ఒకేలా ఉండదు. నిమ్మకాయ, పంచదార, ఉప్పు, నీళ్లేకాక, నిమ్మరసం చెయ్యటంలో కళ్లకి కనిపించనిదొకటుంది – ఆ కనబడని



## మరో ఏడాది గడిచిపోయింది

ఉగాది.. యుగాది.. తెలుగు నూతన వత్సరారంభం... మరో సంవత్సరం గడిచిపోయింది. శిశిర ఋతువు ముగియగానే నూతన వత్సరమారంభమగును. ఉగాది తెలుగు సంవత్సరాది. నూతనమగు భావములకు శ్రీకారము చుట్టినప్పుడే సంవత్సరము నూతనముగాని, కేవలం నూతన వస్త్రధారణతో, ఉగాది పచ్చడి తినడంతో నూతనత్వపు అనుభూతి లభించదు. నూతన సంవత్సరము నూతన భావములతో సత్యమై నిలచును.

ఉగాది పచ్చడి షడ్రుచుల సమ్మేళనం (తీపి, పులుపు, చేదు, కారం, వగరు, ఉప్పు). జీవితం అన్ని రుచుల (అనుభూతుల) సమ్మేళనం అని ఎరుగుటకు, అనుగుణంగా వర్తించుటకు కావలసిన అవగాహనను పెంపొందించుకొని, ఎరుకలో నిలుపుకొనుటకే అన్నది ఎరిగిననాడు బోధను గ్రహించిన వారమవుతాము. లేకుంటే కేవలం పచ్చడి (షడ్రుచుల పదార్థాన్ని-పదము అర్థాన్ని తెలిపేది పదార్థం) తిన్నవారమే గానీ పదము యొక్క అర్థాన్ని తెలియనివారమవుతాము. ఏ పని చేస్తున్నా అర్థం తెలుసుకొని చేయండి అన్న గురువుగారి మాటలలోని అంతరార్థము ఇదే.

జీవన గమనంలో మరో ఏడాది గడిచిపోయింది. మరో క్రొత్త ఏడాది వచ్చేసింది. కాలంతో పాటు క్యాలెండర్ మారింది. తేదీలు మారాయి. ఈ మార్పు మన జీవితంలో, జీవనంలో అంటే భావనలో, మాటలలో, ప్రవర్తనలో, చేతలలో ఎందుకు రాకూడదు? అలా అనుకున్నంత మాత్రాన మనసు వింటుందా!

ఓ మహితాత్ముని కవితాత్మక హృదయం దర్శిద్దాం.
మరో ఏడాది గడచిపోయింది...
జీవితాన్ని ఈ సారీ దాటేసావా
నీ ఆత్మానందాన్ని వ్యక్తపరిచావా
లేక వంకలు వెతుక్కుని తప్పించుకుంటున్నావా!
నీ మనసులో వున్న ప్రేమతో
మమతని పంచావా
లేక నీ వికలానికి ఏమైనా కారణం వెతుకుతున్నావా!
నీ తోటి వారి సుగుణాలను





వివరాలు సేకరించి ఆ వ్యక్తి ద్వారా ఆ పనికి సంబంధించిన వ్యవహారాన్ని నడిపేవారు. వారు చూపే శ్రద్ధ, ఆసక్తి పని త్వరగా పూర్తి చేయించాలనే తపన, ఎంతో చాకచక్యంతో ఆ పనిని చేయించాలనే తపన చూస్తుంటే ఎవ్వరైతే పని కావాలని కోరారో వారికే ఒక అనుమానం వచ్చేది, ఏదో లాభం లేకుంటే ఎందుకు ఇంత శ్రమ తీసుకొంటున్నారు గురువుగారు అనిపించేది. అంటే ఆ పని వలన లాభం పొందేవాడే అనుమానించేంతగా గురువుగారు ఇన్వాల్వ్ అయ్యేవారు. సర్వమానవాళికి సహాయపడదామన్న తలంపే వారిని నిరంతరం బాబాను ప్రార్థించేట్లు చేసి బాబా అనుగ్రహవిశేషంగా, బాబావారి అద్భుత మహిమాన్వితమైన స్థితిని పొంది ఈనాడు వారిని ఆశ్రయించినవారికి కష్టాలు తీరుస్తూ మానవాళికి మహోపకారం చేస్తున్న మహితమూర్తిగా వెలుగుతున్నారు. ఇదే గురువుగారు చెప్పే “ఏ పని చేస్తున్నా హృదయపూర్వకంగా చేయండి” అన్నది.

మానవతా విలువలకిచ్చినంత విలువ గురువుగారు దేనికీ ఇవ్వరు. సాటిమనిషి ఆకలితో వుంటే వారు చూడలేరు. వారితో ఎందరు వున్నా సరే అందరితో కలిసి భోజనం చేయాల్సిందే. వారికి ప్రత్యేకంగా ఏదైనా పెడితే ససేమిరా ముట్టుకోరు. ఏదైనాసరే అందరికీ సమంగా పెట్టాల్సిందే. అందరితోపాటు తినాల్సిందే. ఆనాటి బాబాను మరిపిస్తారు ఎన్నో విషయాలలో. బాబాకు అగరువత్తులు తప్ప అందరిలాగ పూలమాలలు, టెంకాయ, పండ్లు తాంబూలం, కర్పూరంలాంటి ఖర్చుతో కూడుకున్నవి సమర్పించరు. ఆ డబ్బును ఆకలితో బాధపడేవాళ్లకు ఇచ్చి బాబా చెప్పినట్లు వారికిష్టమైనటువంటి “ఆకలిగొన్న వారికి అన్నం పెట్టు” అన్న సూక్తిని తు.చ.తప్పకుండా ఆచరించిన వారైనారు. అన్నింటికన్నా గొప్ప విషయం **“ఒక్కపూట అన్నం పెట్టగానే సరిపోదు. మనం అన్నం దొరికే మార్గం చూపగలగాలన్నది” గురువుగారి అభిమతం.** ఆ విధంగా ఎందరో నిరుద్యోగులకు వారివద్ద ఉద్యోగం ఇవ్వడమే కాదు ఎందరికో రికమెండ్ చేసి ఉద్యోగాలిప్పించారు. అంతవరకే వారి పని. వాళ్లు కృతజ్ఞతగా వచ్చి ఉద్యోగం దొరికిందని చెప్పారా లేదా అని ఆలోచించరు. సాటిమనిషికి సహాయం చేయడమే గురువుగారి పని.

గురువుగారు ఆహారం తినేపద్ధతి కూడా అందరికన్నా ప్రత్యేకంగా ఉంటుంది. ఎన్నిరకాల పదార్థాలను పెట్టినాసరే ఒకటిరెండు పదార్థాలతో తింటారు తప్ప మూడో పదార్థం తాకరు. ఒక కూర, ఒక సాంబారో లేక రసం తప్ప వేరే వాటిని ముట్టరు. తినే ఆహారం కూడా బహుస్వల్పం.




శరీరం నిలబడడానికి తింటారు తప్ప రుచుల కోసం తిన్నట్టు ఉండదు. బాబా చెప్పినట్టు "రుచులకు పోవద్దు కేవలం ఒకటి, రెండు పదార్థాలతో తృప్తి చెందు" అన్న సూక్తి అక్షరాల వారి విషయంలో అమలు జరిగినట్టు ఉంటుంది. తినేది కూడా తృప్తిగా ఆనందంగా తిన్నట్టు ఉంటుంది తప్ప సూక్తిని పాటించేందుకు అలా ప్రవర్తించినట్టు ఉండదు.

గురువుగారికి తనే స్వయంగా వండి అందరికీ పెట్టడమంటే సరదా. బ్రహ్మచారిగా ఉన్నప్పుడు తన ఒక్కడి కొరకు ప్రత్యేకంగా వండుకొనేవాళ్లు కాదు. ఏదో మజ్జిగ అన్నం తినేవారు. ఒక్కోసారి గంజి అన్నం తినేవాళ్లు తప్ప కూర కూడా చేసుకొనేవాళ్లు కాదు. వారి పని కావాలని వారివద్దకు పోయిన గురుబంధువులకు ఎంతో శ్రద్ధగా రుచిగా వండిపెట్టేవాళ్లు వారివద్ద ఎక్కువకాలం గడిపి వారి చేతివంటను తినగలిగే భాగ్యం నాకు కలిగింది. కొసరి కొసరి తల్లిలాగా వడ్డించి తినిపించేవారు. వారు చేసినట్టు వంటను అంత రుచిగా ఎవ్వరూ చేయడం చూడలేదు. అంత రుచిగా వుండేది. పదార్థాలు ఎక్కువ లేకున్నా ఉన్నవాటితో ఎంతో బాగా తయారుచేసేవాళ్లు. వంట చేసేటపుడు మనం అడిగితే ఎలా చేయాలో ఎప్పుడు ఏమి వేయాలో చెపుతూ చాలా ఈజీగా ఆడుతూపాడుతూ, వంట చేస్తున్న భావమే లేకుండా చేసేవారు. ఇంత రుచిగా చేయగలగడానికి సూక్ష్మం చెప్పారు. ఏ పనైనా 'శ్రద్ధాసబూరీ' లతో చేసే గురువుగారికి వంట అద్భుతంగా చేయగలగడం విచిత్రమేమి కాదు అనిపించేది. రమణమహర్షి, సాయిబాబాలాంటి మహాత్ములంతా అద్భుతంగా వంట చేసినట్లు, వచ్చిన భక్తులందరికీ వారే స్వహస్తాలతో వడ్డించినట్లు వాళ్ల చరిత్రలలో మనం చూడవచ్చు.

ఏ పని చేసినా ఎంతో నైపుణ్యంతో, ఈజీగా చేయగలగడం ముక్తులైన మహాత్ముల వలననే అవుతుందని మనకు ఎందరో మహాత్ముల చరిత్రల ద్వారా తెలిసిన సత్యం. ఏ మహాత్ముడినైనా వాళ్ల నడవడికను బట్టి వాళ్ల స్థితిని తెలుసుకొనవచ్చును. అలాగే గురువుగారి విషయంలో కూడా బాబా మనకు ఉపదేశించి ఆచరించిన విధంగా ఎన్నో విషయాలలో కనపడుతాయి.

"బట్టలు లేని వారికి బట్టలివ్వు" అన్న బాబా సూక్తి గురువుగారు అక్షరాలా పాటించినట్టు మనకు కనబడుతుంది. వారు ఉపయోగించిన బట్టలనే గాక, అమ్మగారు-శృతి వాడిన బట్టలను ఎందరికో ఇప్పించేవారు. అవీ పూర్తి కండీషన్‌లో ఉన్నప్పుడే వాటిని బట్టలు లేనివారికి ఇప్పించేవారు.





మన లేజీనెస్, అది మన కంట్రోల్‌లో వుంటుంది. కంట్రోల్‌లో ఉండడం వల్ల ఏమవుతోంది? బాగా తినాలనిపిస్తుంది, నీకు బ్యాంక్ నిండా డబ్బులున్నాయి. తినగలవు, కానీ నీ హెల్త్ బాగా లేదు. నీ లివర్ బాగాలేదు. స్టమక్ బాగాలేదు. తింటే డయారియా, తినకపోతే ఆకలి. అట్లా కాకుండా, ఎంత పడితే అంత తిని హరాయించుకునే శక్తిని ఇచ్చేటటువంటిది నియమము.

బాబా అన్నీ ఇస్తాడు నీకు, అనుభవించడానికేముంది? సత్సంగం, సత్సంగం అని అన్నారు. కూర్చున్నాము. నిదుర వస్తుంది. తూగుతున్నారు. అట్లా నిదుర రాకుండా మనసును నియమించుకో గలగాలి. అది నియమము ఇస్తుంది. ఆ బలాన్ని. అందుకని బాబా గ్రేస్‌ని అనుభవించే శక్తిని నీకిచ్చేటటువంటిది నియమము.

**– శ్రీబాబూజీ**

కబీరు అనే మహానుభావునికి ఒక సందేహం వచ్చిందట. తన ఎదుట గురువు, గోవిందుడు ఇద్దరూ ఎదురైతే మొదట ఎవరికి మ్రొక్కాలి అని. గురువుని, వెళ్లి అడిగాట. నన్ను నీకు ఇచ్చింది గోవిందుడే కదా! అందుకు ఆయనకే మొదట నమస్కరించు అని చెప్పారట. గోవిందుని దగ్గరకి వెళ్లి అడిగితే (నా గురించి) నన్ను తెలిపింది గురువే కదా నీకు, అందుకు ఆయనకే మొదట నమస్కారం అని చెప్పారట. చివరకు ఆలోచించి, గోవిందుడు నేరుగా మాట్లాడడు, తనకు కావాల్సినవి ప్రత్యక్షంగా గురువే కదా చూసేది అని గురువునే ఆశ్రయించాడట. భగవంతుని ఆశ్రయించడం చేయి పట్టుకు పని చేయించుకున్నట్లే, చేయిపట్టుకొని అడిగితే ఎవరైనా దులుపుకొని పోయే ప్రమాదమూ ఉంది. కానీ కాళ్ళు పట్టుకుంటే (ఉన్న దానికి గురుతు పాదాలు) పోయే ప్రమాదం ఉండదు.

భగవంతుని మనం ఎప్పుడూ నేరుగా ఆశ్రయించే ప్రయత్నం చేయవద్దు. భగవంతుడు ఒకవద్ద ఉన్నాడంటే దాన్ని తీర్థం అనో, క్షేత్రం అనో అనొద్దు. మరి ఏది తీర్థం, క్షేత్రం అంటే భగవత్ భక్తుడు (మహాత్ములు) ఎక్కడైతే నివసిస్తారో దాన్ని తీర్థం (క్షేత్రం) అంటారు. నడిచే తీర్థం అంటారు, నదీమా తల్లుల్లా. అందుకే మహానుభావులను తీర్థంకరులని, భగవత్ పాదులు అని పిలుస్తారు. ఎందుకంటే భగవంతుని అందివ్వగలిగిన, మనల్ని పవిత్రం చేయగలిగిన వారు అని అర్థం. అందుకే భగవంతుని కాదు పట్టుకోవాల్సింది, భగవత్ భక్తుని పట్టుకుంటే వారిని వదులుకో లేక మనకు ఇద్దరూ లభిస్తారు.



అనే విషయం మనకు అర్థం అవుతుంది కనుక, ఇక అమాయకంగా అటువంటి భ్రమలలో పడం. బాబా యొక్క నిజమైన తత్వం ఏమిటి? అది నిజంగా ఫాలో చేయడమంటే ఎలా ఫాలో చెయ్యాలి? మన స్పెషల్ ఇది ఏమిటి? 'మా సాంప్రదాయమే వేరు' అన్న బాబా యొక్క తత్వం ఏ రకంగా మనం చూపించాలి? అనేది నిరూపించండి ప్రపంచానికి. అది చెయ్యండి. నాకు సంతోషమైనది అది.

డాక్టర్లున్నారు, ప్రాక్టీస్ చేస్తున్నారు. ఎప్పుడో వారానికి ఒకసారో, నెలకొకసారో, డబ్బులేక కొంచెం కష్టంగా ఉండేటటువంటి వాడికి ఉచితంగా చేయండి. మనమేం చేస్తాం. ఇటువంటి ఏక్టివిటీస్ చేస్తాం, సోషల్ సర్వీస్ ఏక్టివిటీస్ చేస్తాం. ఫోన్ చెయ్యంగానే మాట్లాడుకోవడం, ఈరోజు ఏంట్రా, నువ్వేం ప్రిన్స్‌పుల్ ఫాలో చేసావురా? అది మాట్లాడుకోండి. ఈ రోజు నేను అబద్ధం చెప్పకుండా వుండాలనుకున్నాను, చెప్పాల్సి వచ్చింది. ఈ రోజు ఏదో చెప్పేశాను, కనుక పనిష్మెంట్ ఏంటంటే, రెండురోజులు పెట్టుకుంటా నియమం. మీకంటే మీరు పోటీ, అది చేసుకోండి. చూడండి ఎంత తమాషాగా, ఎంత నైస్‌గా వుంటుందో. మీ లైఫ్‌లోనే మీకు ఒక మానసికంగా కాని, ఆరోగ్యపరంగాకాని, బాబా మహిమపరంగాగాని ఎంత ఆనందం పొందుతారో చూసుకోండి. మీ లైఫ్ ట్రాన్స్‌ఫామ్ అవుతుంది. కూర్చొని మన అందరము మాట్లాడుకుని, ఈరోజు మనం ఈ వారంనుంచి నేను కరెక్ట్‌గా ఏడుగంటలనుంచి ఎనిమిదిగంటలదాకా బాబానామము చేసుకుంటాను. ఇట్లా ఏదో ఒకటి, నేను చెప్పేటటువంటిది ఒక నియమము పెట్టుకొని, ఒక రిజాల్వ్ పెట్టుకొని, వచ్చేవారం మళ్లా వచ్చిన తరువాత, ఎంతమంది చేయగలిగారు, ఎంతమంది చేసుకోలేదు, then you see the progress, మీ ప్రోగ్రెస్ కార్డు మీ చేతులలోనే ఉంది. మీ ప్రోగ్రెస్‌కార్డ్ దిద్దేవాళ్లు మీరే, ప్రోగ్రెస్‌కార్డు మీద సంతకం పెట్టేవాళ్లు మీరే.

మేమింతకాలంగా సత్సంగానికి పోతున్నాము, మాలో ఏ మార్పు రాలేదు గురువుగారు, మేము అట్లాగే ఉన్నాం. ఇట్లా కాకపోతే ఎట్లా ఉంటారు మరి. మీకు సిలబస్ లేదు. స్కూలుకు పోతున్నారు, వస్తున్నారు. సార్! నియమం పెట్టుకునేటప్పుడు నియమం వెనుక వున్న రహస్యమేమిటి? ఉదయమే ఆరుగంటలకి నువ్వు నిద్ర లేవాలనంటే ఎంత కష్టం? ఆరునూరైనాసరే లేవగలగాలి, (లేవాల్సిందే) అనే స్పిరిట్‌ని నీలో కలుగచేస్తుంది. effort కు ఒక రూపాన్ని ఇస్తుంది. తరువాత మైండ్ మన కంట్రోల్‌తో ఉంటుంది. ఈ effort నుంచి దూరంగా తీసుకొని పోయేటటువంటిది.





చినిగిన బట్టలను కుట్టుకొని వారు వాడుకొనేవాళ్లు తప్ప చినిగిపోయినవి ఇప్పించేవారు కాదు.

మనిషికి ప్రాథమిక అవసరమైన ఆహారం విషయంగా వారి దృక్పథం చూచాము. ఇక వారి నిద్ర విషయం తెలుసుకొందాము. గురువుగారు ఏదైనా పనిని మొదలుపెడితే రాత్రింబవళ్లు ఆ పని పూర్తయ్యేవరకు నిద్ర పోయేవారుకాదు. పోయినా ఒకటి రెండు గంటలే. మామూలుగా ఎప్పుడు నిద్రపోయినా 4గంటలు నిద్రపోయేవారు తప్ప అంతకంటే ఎక్కువసేపు నిద్రపోయేవారుకాదు. ఆ పోయేది కూడా తృప్తిగా పోయేవారు. ప్రక్కన ఎంత శబ్దం వచ్చినా లేవరు. కానీ వారు పండుకొనే రూములోనికి మనం పోతే, కాలు ఆడిస్తూ ఉంటారు. నిద్రపోతున్నారా అనుకుంటే అలా ఆడిస్తుంటారు. వారు నిద్రపోతున్నారో, మేల్కొని ఉన్నారో మనకు అర్థం కాదు. జ్ఞాని ఎప్పుడూ మూడు అవస్థలలో ఎరుకతో వుంటారని, వాటికి అతీతంగా కూడా ఎరుకలో ఉంటారనే సత్యం మనకు ఇక్కడ అర్థం అవుతుంది.

మనిషిని నిద్రనుంచి లేపడం అంటే వారికి అసలు ఇష్టం ఉండదు సరిగదా, మనం ఎవరినన్నా లేపినా ఎంతో కోప్పడతారు. వారి పనులు వారే చేసుకుంటారు తప్ప పడుకున్న భార్యనైనా సరే లేపరు. నిద్రపోయేవాళ్లను లేపడం చాలా బాడ్‌హేబిట్ అని కోప్పడతారు.

ఎప్పుడూ మేలుకున్నట్టే ఉంటారు. ఎప్పుడు పడుకుంటారో, ఎప్పుడు లేస్తారో మనకెవరికీ అర్థంకాదు. మనం అర్థం చేసుకోవాలని ప్రయత్నించడం కూడా వ్యర్థమే. నిద్రలేకుండా ఉంటే తట్టుకోలేని మనబోటి వాళ్లకు ఆ స్థితి అర్థంగాదు. కానీ గురువుగారు చెప్పినట్టు ఆరోగ్యవంతుడు నిద్రపోయి మెలకువ వస్తే అప్పుడు లేచివేయాలని మళ్లా బద్ధకించి పడుకోకూడదని, అలా పడుకొనే దానిని తామస ప్రవృత్తి అని అంటారు. అలాంటి వాళ్ళు జీవితంలో ఏదీ సాధించలేరు సరిగదా ఎందుకూ పనికిరాని వారవుతారని గురూజీ అంటుంటారు. రోజంతా ఎక్కువ భాగం బాబా ఎరుకలో ఉండి చాలా కొద్దిసేపు నిద్రపోవాలని నిద్రలో మరపు వుంటుందని అప్పుడు బాబాస్మరణ ఉండదని, కావున నిద్రను జయించి ఎక్కువ సమయం ఎరుకలో ఉండాలని గురూజీ చెపుతుంటారు.

గురూజీతో రాత్రంతా మేల్కొని వున్నా ఎటువంటి అలసట అనిపించదు. అసలు సమయం ఎలా గడిచిందో తెలియదు. (కాలస్ఫురణ ఉండదు) ఎన్నో విషయాలు డిస్కస్ చేస్తారు. వారిని



ఆశ్రయించుకొన్నవారిని తక్కువగా నిద్రపోయేట్టు చేస్తారు. ఎక్కువ సమయాలు ఎరుకలో వుంచాలని కాబోలు. ఎంతో ఆకలి అయితే తప్ప ఆహారం గురించి అసలు ఆలోచించరు. అదీ ఆకలికి శరీరం పడిపోతుందేమో అన్నప్పుడు ఆహారం తీసుకొంటారు. వారితో వున్న వాళ్లను మాత్రం టైమ్‌కి ఆహారం తీసుకోండి అంటారు. అలాగే పెడతారు.

ఒక పనిని అనుకుంటే దానిని పూర్తిచేసేదాకా ప్రపంచ స్పృహ ఉండదు. ఆహారం తినరు, నిద్రపోరు. పోయినా ఒకటి రెండు గంటలే. తిరిగి పనిలో నిమగ్నమవుతారు. ఆహారం కూడా సరిగ్గా తీసుకోరు. వారు చేసే పని బాబాచరిత్రను వ్రాసుకోవడమో లేక కంప్యూటర్‌లో పెట్టడమో చేస్తుంటారు. కళ్లు స్ట్రెయిన్ అయి ఇక చూడలేక మూతలుపడాల్సిందే తప్ప వర్క్‌లో వున్నప్పుడు నిద్రధ్యాస వుండదు. కొద్దిగా కళ్లకు రెస్ట్ తీసుకోవడం తిరిగి పనిలోపడడం. ఏ పని చేసినా ఎంతో శ్రద్ధ, నైపుణ్యం కనబడతాయి. ఏ విషయంలోనూ కాంప్రమైస్ కారు. ఎంత శ్రమ అయినాపడి వారు అనుకొన్న పర్ఫెక్షన్ని సాధిస్తారు.

శ్రీలంకలో తమిళులకు, సింహళీయులకు జరిగే దారుణ యుద్ధంలో ఎంతోమంది చనిపోయినట్టు న్యూస్‌పేపరు చదివి, ఆ మారణకాండలు ఎక్కడ జరిగినట్టు విన్నా గురూజీ ఎంతో చలించిపోయేవారు. ఈ మారణహోమానికి అంతంలేదా? అని ఎంతో బాధపడేవారు. మామూలుగా న్యూస్ అని మనం చదివేసినా, గురువుగారు ఆ న్యూస్‌లోని విషయానికి ఎంతో ప్రాముఖ్యతనిచ్చి స్పందించేవారు. పేపర్ని అందరిలాగా చూడరు. వారి దృక్పథం వేరుగా ఉంటుంది. మనం చదివి వదిలేస్తాము. అలాకాక ఇంపార్టెంట్ విషయాన్ని గుర్తుపెట్టుకోవడమో, కట్టింగ్ తీయించి పెట్టడమో చేసేవారు. మన దృష్టిలో పడని న్యూస్ కూడా వారి దృష్టిలో పడి మనకు తరువాత చెప్పేవారు. మనం చూచినపుడు కనపడలేదేమిటా అనిపించేది. ఏ పనిచేసినా శ్రద్ధగా చేస్తారు కాబట్టి వారు పేపరు చదివినా అంతే శ్రద్ధగా చదివేవారు.

విజ్ఞాన సముపార్జన పట్ల వారికున్న ప్రీతి ఇంక దేనిమీదా ఉండేదికాదు. వారు సంపాదనలో ఎక్కువపాళ్లు బుక్స్ కొనుక్కోవడానికే ఖర్చుచేసేవారు. వారి ఆస్తి అంతా పుస్తకాలే. ప్రపంచంలో పెద్దపెద్ద రచయితలు వ్రాసిన బుక్స్ అన్నీ దాదాపు గురువుగారి దగ్గర వున్నాయి. వారి వద్దలేని సబ్జెక్ట్





## సాయినాధుని సత్సంగ సుధ

## నియమము

గురువారము రోజున సత్సంగ్ దే అంటే ఉద్దేశ్యము ఏమిటి? ఆ రోజున ఏదో ఒక ప్రిన్సిపుల్ ఫాలో చేసి డైరీలో వ్రాసుకోండి. ప్రతి ఒక్కరు చిన్నదో, పెద్దదో, మిగతావాళ్లకంటే భిన్నంగా, మా సాంప్రదాయమే వేరు అన్నారు బాబా. ఏ రకంగా వేరని మీరు చూపిస్తున్నారు? 365రోజులలో మనం ఒక్క వీక్‌కు ఒక్క ప్రిన్సిపుల్, దీన్ని ఫాలో చేయాలి. చిన్నదో, పెద్దదో అందరూ అన్నీ పెద్దవి చేయాల్సిన అవసరం లేదు. నేనేమీ మిమ్మల్ని కష్టపడమని చెప్పటంలా. చిన్న, చిన్నవన్నా చేయండి. మంచివి మనకుగాని, ప్రక్కనవాడికిగాని, సమాజానికిగాని మంచయ్యేటటువంటిది ఒకటి చెయ్యాలి. దాంట్లో మన విశిష్టత బయటపడాలి. అబ్బా, వీళ్లు సాయిపథం వాళ్లురా, వాళ్ల పద్ధతే పద్ధతి అనగలిగి ఉండాలి అంతే. అలా మీరుంటే నాకు సంతోషం. చిన్న ప్రిన్స్‌పుల్ ఫాలో చేసినా సంతోషం. ఇంకా బాబాకి దగ్గరవుతారు. మన లైఫ్ కూడా కరెక్ట్‌గా ఆయనే చూసుకుంటాడు అన్నీ. ఇది మీరు చూసుకోండి. మిగతాదంతా ఆయన చూసుకుంటాడు. ఇంక దేనికీ మనం లోటుపడాల్సిన అవసరమేమీలేదు.

మనం అవీ చూసుకోవడం మానేశాం. బాబానే చెప్పారు. ఎందుకు నేను మీ కష్టాలు తీరుస్తాను, మీకు ఎందుకు రక్షణ ఇస్తాననంటే, ఆయన ఇవ్వదలచుకున్నదేదో ఉన్నది. పిల్లవాన్ని స్కూలుకు పంపించడానికోసరంగా చాక్లెట్లు ఇవ్వడంలాంటిదిది. నీకో చాక్లెట్ ఇస్తా స్కూలుకిపో అని చెప్పి. మనం ఏం చేస్తున్నాం, చాక్లెట్ కోసరంగానే స్కూలు అని చెపుతున్నాం. చాక్లెట్ తినేసి, స్కూలుకు పోవటంలా! నాలుగురోజులు ఇస్తాడు, అయిదురోజులు ఇస్తాడు, ఆరో రోజున చాక్లెట్స్ ఇవ్వడం మానేస్తాడు. అవి కూడ వుండవు మనకి. కాబట్టి ఈ చాక్లెట్లు అంత ఎటువంటివి అంటే – అటువంటి ప్రిన్స్‌పుల్స్‌ని మనం ఫాలో చేసేదానికి. అసలు మన ప్రిన్స్‌పుల్స్ ఏమిటి అర్థం చేసుకోండి, వాటిని మనం ఎంతవరకు మనం ఫాలో చేస్తున్నాం? ఫాలో చేయలేకపోవచ్చు. దానికేం లేదు. కాని చెయ్యాలనేటువంటి తపన అన్నా ఉండాలి. కనీసం ఆ ప్రయత్నం అన్నా ఉండాలి. బాబాకు మనందరం పిల్లలం, తప్పులు చేస్తుంటాం పోతుంటాయి, దాని గురించేమీ లేదు. దీన్లోంచి నేర్చుకుంటాం మనం. నేర్చుకుని మనం రెక్టిఫై చేసుకొనిపోవాలి. ఒకసారి తప్పుచేసిన తరువాత, మనం తప్పు ఎందుకు చేస్తాం, ఎలా చేస్తున్నాం, ఏ కారణాల ద్వారా చేస్తున్నాం, ఏ పరిస్థితుల ద్వారా చేస్తున్నాం



పాత నిబంధనలతో కలుపుకొనుట అవివేకము. పాత వాని విలువ కాలక్రమమున తగ్గుట వలననే కదా క్రొత్తవి ఏర్పడినవి! నిన్నటి పాలు నిన్నటికే పరిమితము. నేడు వాటికి కాలదోషము పట్టినది. కనుక ప్రకృతి నేడు మరల పాలేర్పరచినది. నిన్నటి ఆహారమునకు కూడ నేటికి కాలదోషము పట్టినది. కనుక మరల ఆహారమేర్పడినది. పాత నిబంధనలు కూడ క్రమేపి వక్రించబడి దోష భూయిష్టములైనవి కనుకనే క్రొత్త నిబంధనలు. క్రుళ్లిన పండ్లతో తాజా పండ్లను కలిపినచో ఇవియును క్రుళ్లును.”

“దైవము మరల ప్రస్ఫుటముగ తనను చేరు విధానమిచ్చుచున్నప్పుడు దాని ననుసరించుటకు విశ్వాసము కావలెను. పాత విశ్వాసమును విసర్జించగల ధీరత్వము కూడా కావలెను. అభ్యాసవశమున పాత విషయములను క్రొత్త విషయములతో కలుపుకొనుట వలన తికమక యేర్పడును. కనుక నాపై విశ్వాసమున్నచో నన్ననుసరింపుము. పాత విశ్వాసములను విసర్జింపుము. పాత గుడ్డతో క్రొత్త గుడ్డ కలిపి కుట్టుకొని వ్యర్ధముగ జీవింపకుము. ఈ క్రొత్త యందు పాత అంతయూ సూక్ష్మముగ అమర్చబడినది.”

దైవానుగ్రహము, దైవసాన్నిధ్యము ఏ క్షణమున లభించునో ఎవ్వరికిని తెలియదు. అప్రమత్తుడై ఉండుటయే మార్గము. అప్రమత్తత లేని వారు విఫలులై జీవించుచుందురు. (చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకొను చందమున) అప్రమత్తుడై ఉండుట తండ్రికి తగ్గ బిడ్డగా, శిష్యునిగా, సాధకునిగా భక్తుని లక్షణము. నా తండ్రి ఏ క్షణమునైనను నన్ను చేరగలడు. కాలము, దేశము అతనికి అవరోధములు కావు. అతని రాకపోకలను గమనించుచు. అతని ఆదేశములను నిర్వర్తించుచు జీవించుట నా కర్తవ్యము. అదియే నా జీవనమునకానందము. దైవమెప్పుడైనను దర్శనమీయవచ్చును. అది ముందుగా తెలియదు. ఆ సమయమున మీరు నిద్రించుటయో, కబుర్లలో పడుటయో జరుగుచుండును. ఆర్తిని బట్టి అప్రమత్తత ఉండును.

## నా సద్గురు స్పర్శ

*సరైన పద్ధతిలో బాబాను అంటిపెట్టుకోవడానికి మీరే మార్గాలను అన్వేషించుకోవాలి. ఊరకే అలా కూర్చొని కళ్ళు మూసుకోవడం మాత్రమే కాదు, కళ్ళు తెరచిన తరువాత మీరు ఏం చేస్తున్నారు, ప్రపంచంతో ఎలా వ్యవహరిస్తున్నారు, బాబా పట్ల మీరు ఎలా ప్రతిస్పందిస్తున్నారు, సత్సంగంలో మీ ఉద్దేశాల్ని ఎలా పంచుకుంటున్నారు? వీటన్నిటి గురించి మీలో సరిచూసుకోవాలి. దానికి అనుగుణంగా పరిస్థితులను మలచుకోండి.*

*– శ్రీబాబూజీ*





లేదు. ప్రాపంచికంగానూ, ఆధ్యాత్మికంగానూ ఎన్నో విలువైన పుస్తకాలువారివద్ద ఉన్నాయి. అతి అరుదైన పుస్తకాలు ఎన్నో వున్నాయి. ప్రపంచంలో పెద్దపెద్ద బుక్ పబ్లిషర్స్ ప్రచురించిన బుక్ కాటలాగ్స్ అన్నీ దాదాపు గురువుగారివద్ద ఉన్నాయి. ప్రివేదిక్ కల్చర్ నుండి మోడర్న్ కల్చర్ వరకు వున్న చారిత్రాత్మక బుక్స్ అన్నీ గురువుగారి లైబ్రరీలో వున్నాయి. ఒకసారి గురువుగారి లైబ్రరీని చూచిన వాళ్ల నాన్నగారికి ఒక అనుమానం వచ్చిందట. ఇన్ని బుక్స్ చదివి వుంటారా? లేక చదవడానికా? లేక లైబ్రరీలో పెట్టుకోవడానికా? అని. ఆ అనుమాన నివృత్తి కొరకు వారు బుక్స్‌ని చూస్తే ప్రతి బుక్‌లో కొన్ని వాక్యాలు అండర్‌లైన్ చేసి ఉండడమో, సైడ్‌లో నోట్ వ్రాసి ఉండడమో చూచి ఇంత క్షుణ్ణంగా అన్ని బుక్స్ చదివి వున్నందుకు ఎంతో ఆశ్చర్యపోయారట. ఇంత చిన్న జీవితకాలంలో అన్ని బుక్స్ ఎప్పుడు చదివారో మన ఊహకు కూడా తట్టదు. ఆ చదవడం కూడా మనమాదిరి కాలక్షేపానికి కాదు. క్షుణ్ణంగా చదివి నోట్స్ రాసుకునేవారు. ఏ బుక్‌లో ఏ పేజీలో ఏ మేటర్ వుందో ఏ సైడ్ వుందో కూడా కరెక్టుగా చెప్పగలిగేవారి జ్ఞాపకశక్తి నిరుపమానం. ప్రాపంచికంగా ఎన్నో విషయాలు తెలుసుకోవాలన్న జిజ్ఞాసే వారిని ఆధ్యాత్మికంగా ఉన్నతస్థితికి చేరాలన్న జిజ్ఞాస అయి ఆ స్థితి పొందేలాగా చేసింది. స్పిరిట్యువాలిటీ వేరు, మెటీరియల్ వేరు అని కాకుండా ఇహంలో ప్రతిదీ తెలుసుకోవాలన్న తపనను కలిగిస్తుంది అన్న విషయం మనకు గురువుగారి ప్రవర్తన వలన అర్ధమవుతుంది.

ఏ కాగితం మీద ఏ అక్షరమున్నా సరే వాటిని చూచి చదవకుండా వుండరు. గురువుగారు అవసరమైన వాటిని వుంచుకొని మిగిలిన పనికిరాని వాటిని చింపి పారవేసేవారు. మామూలుగా మనకు ఇష్టమైన విషయాన్ని శ్రద్ధగా చదువుతాము. మిగిలినవి కాలక్షేపానికి చదువుతాము. మనస్సులోనికి ఎక్కించుకోము. కాని గురువుగారు అత్యుత్తమ ఆధ్యాత్మిక పుస్తకాన్ని ప్రాపంచిక నవలనూ ఒకే శ్రద్ధగా చదవడం ఎంతో ఆశ్చర్యం కలిగిస్తుంది.

గురువుగారు ఏదైనా విషయం గురించి వ్యాసం వ్రాస్తుంటే వారు దానిలో చెప్పదల్చుకున్న విషయానికి సపోర్టింగ్‌గా ఎందరో రచయితల అభిప్రాయాలను రిఫర్ చేస్తూ వ్రాస్తారు. ఎంతో సునిశితమైన జ్ఞాపకశక్తి లేకుంటే అన్ని విషయాలు గుర్తుండి రిఫర్ చేయడం సాధ్యపడదు. వారు చెప్పదలచుకున్న భావాన్ని మనకు అర్ధమయ్యేట్లు చెప్పగల వారి శైలి ఎంతో అద్భుతం. వారి భాష



హృదయాన్ని తాకి మనలో ఆలోచన కలిగించేట్లు చేస్తుంది. అనవసరమైన పదం ఒక్కటి కూడా ఉండదు. వారి రచనలలో భావగాంభీర్యం తప్ప పదగాంభీర్యం వుండదు. వ్యాసరచనలో వారిది విలక్షణమైన శైలి. ఎవ్వరినీ అనుసరించినట్టుగాని, అనుకరించినట్లుగాని వుండదు. వారి శైలి వేరుగా వుంటుంది. వ్యాసాలకు వారు పెట్టే క్యాప్షన్స్ ఎంతో అందంగా వుంటాయి. వాటిని సెలక్ట్ చేసే విధానం అద్భుతంగా వుంటుంది. ఆ క్యాప్షన్‌లో మనం చదవబోయే వ్యాసం యొక్క స్క్రిప్ట్ అంతా వుంటుంది. కొన్ని క్యాప్షన్సు ఆ వ్యాసంలో వున్న మహాత్ముని పర్సనాలిటీ మొత్తాన్ని ప్రతిబింబిస్తుంటాయి. ఒక మహాత్ముని గురించి వ్రాసినా, చారిత్రక నేపథ్యంలో వున్న పరిశోధక వ్యాసాలు వ్రాసినా, ఆచార వ్యవహారాల పట్ల అవగాహన కల్గించినా, దురాచారాలను తూర్పారపట్టినా ఏ ఆర్టికల్‌కి ఆ ఆర్టికల్ సాటి. వారు చెప్పదలచుకొన్న విషయాన్ని సహేతుకంగా, నిదర్శనాలతో, ఆలోచింపచేసేట్లుగా వుంటుంది. గురువుగారు వ్రాసిన వ్యాససంకలనాన్ని చూచిన ఒక ముసలాయన "ఈ ఆర్టికల్స్ ఎవరో తలపండిన వ్యక్తి ఎంతో అనుభవంతో వ్రాసినది" అని నాతో అన్నారు. (ఇంకా వుంది) ***– డా॥ బి.శ్రీనివాసులురెడ్డి***

## శ్రీరాముని హిత వాక్యములు

జాబాలి పలికిన నాస్తికమగు వాదమునకు రాముడీవిధముగ బదులిచ్చినాడు. ఇందు శాశ్వత ధర్మములు గోచరించును.

1. ప్రియము కలిగించునని అకార్యము చేయరాదు, చేయమని ప్రోత్సహించరాదు.
2. మానవుని యోగ్యాయోగ్యములు అతడి నడవడిని బట్టి తెలియును గాని, భాషణము బట్టి కాదు.
3. పవిత్రము, ప్రియము అగు భాషణము సత్యముగా భావింపరాదు. సత్యమని భ్రమపడి అనుసరించరాదు.
4. పవిత్రము, మధురము అగు భాషణము కలిగి, ప్రవర్తనమునందు అట్టి పవిత్రత గోచరింపనిచో అట్టివాడు చెడును.
5. నడవడియే మానవుని ఎరుంగజేయును.
6. వేషభాషలు, బాహ్యశుచి వేరు, అంతఃశుచి వేరు. మదము, మాత్సర్యము, లోభము, మోహము, మోసము ఇత్యాదివి లేని పురుషుడే పవిత్రుడు.





7. ఎవడు ధార్మికుడో, ఎవరు కాదో క్రియలయందు మాత్రమే తెలియగలదు.
8. ఒక మాటనిచ్చి దానికి కట్టుపడకుండుట అధర్మమగును. అట్టివాడు అసత్యమాడినవాడితో సమానము.
9. సత్యమే పరమేశ్వరుడు, భగవంతుడు. సత్యమును వీడిన వారిని భగవానుడు కూడా వీడును. (సత్యాన్ని అంటిపెట్టుకో –శ్రీబాబూజీ)
10. లోకములను పాలించుటకుగాని, వంశమును ఉద్ధరించుటకుగాని, స్వర్గమును పొందుటకు గాని, సత్యమే ప్రధానము. నేను వనవాసదీక్షను అంగీకరించి నిర్వర్తింతునని మాట ఇచ్చినాను. దానిని పాలించుట నా ధర్మము. అట్టి పాలనము రాజ్యము, కీర్తి, యశస్సు కన్న ముఖ్యము.
11. ఇహమున చేసిన కర్మమందలి ధర్మమే – పరమున ప్రకాశమిచ్చునని ఆర్యులు తెలిపినారు. నేను దానిని విశ్వసించువాడను. ధర్మాధర్మములే సృష్టియందు జీవులకు ఆరోహణ అవరోహణలు కలిగించును. పదునాలుగు సంవత్సరములు వనవాసదీక్ష నాకందిన కర్తవ్యము. దానిని నిర్వర్తించుటయే నా ధర్మము మరియొకటి కాదు.

## పరమగురువు యేసు కథ

"రా! రమ్మని జీవితమంతయూ ప్రార్థించుచూ, వచ్చినప్పుడు గమనింపకుండుట దురదృష్టము కదా! కేవల మెదురు చూచినచో చాలదు. ఆర్తి, స్ఫూర్తి, భక్తి, ప్రేమ ఇత్యాదివి నిజమగు ఉపకరణములు, నా రాకకు ఎందరో యూదులు శతాబ్దములుగ ఎదురు చూచుచున్నారు. వచ్చిననూ గమనింపలేకున్నారు. నా వెంట నడుచు మీరు కూడ నన్నొక వింతగ భావించి అనుసరించుచున్నారే గాని, నా తండ్రి స్పర్శను పొందలేకున్నారు. మీ వృథా ప్రయాస నన్ను బాధించుచున్నది. అంతయూ దైవవిలాసము."

ఏసు మౌనముగ గంభీరుడై సాగుచునుండగ మరియొక అనుచరిడిట్లు ప్రశ్నించెను. నిన్ననుసరించువారు నీ ఉపదేశమును గ్రహించి వర్తించిన చాలునా? లేక పాత నిబంధనలన్నియూ ఆచరింపవలెనా? ఏసు పకపకా నవ్వెను. ఇట్లు పలికెను.

"క్రొత్త గుడ్డను పాత గుడ్డతో కలిపి కుట్టుట అవివేకము. ఇప్పుడే పితికిన పాలను, నిన్నటి పాలతో కలిపి త్రాగుట కూడా అవివేకమే. ఇప్పుడే వండిన ఆహారమును నిన్నటి చద్దితో కలిపి తినుట అనారోగ్యము కూడ. నవనీతముగ కొని రాబడిన సత్యమును, అట్లే ఆచరించుట ఉత్తమము.